గేదా రంగారావు

ప్రాణాలకు పదిలక్షలు

శ్యాంబాబు

ఉదయం ఎనిమిది గంటలు...

గుంటూరు రైల్వేస్టేషనులో జనం హడావిడి చూడ ముచ్చటగా వుంది.

రంగురంగుల చీరల్తో అందమైన అమ్మాయిలు, చేతుల్లో నోట్ పుస్తకాలు పట్టుకొని, బెల్ బాటమ్ పాంట్లతో, భుజాలవరకూ పెంచుకొన్న జుట్టుతో అమ్మాయిల వెనకే ఎస్కార్ట్సులా తిరుగుతోన్న కాలేజీ కుర్రాళ్ళు, మరచెంబు దగ్గరనుండి తట్టా, బుట్టలతో సహా సంసారాన్నంతా ఈ రైలుకే లాగించేయాలనే తాపత్రయంలో వున్న కుటుంబ రావులు, పుస్తకాలు దినపత్రికలు, పళ్ళు, తినుబండారాలు అమ్మేవాళ్ళ కేకలు—అంతా హడావిడిగా వుంది.

4

గుంటూరు స్టేషన్లో ఉదయమే ప్లాట్ ఫారంమీద హడావిడికి కొన్ని కారణాలున్నాయి. ప్రత్యేకంగా ఉదయం ఎనిమిదినుండి పదివరకూ వరుసగావున్న డీసిల్ కార్ సర్వీసుకు ఈ ఊరినుండి విజయవాడకు వెళ్ళే స్టూడెంట్సు, ఉద్యోగులు, రైల్వే పనివారు, వ్యాపారస్థులు అనేకమంది వెళతారు.

"ది షటిల్ సర్వీస్ ఫ్రమ్ గుంటూర్ టు విజయవాడ ఈజ్ ఆన్ ప్లాట్ ఫారం నెంబర్ వన్"—మైక్‌లో ఎనౌన్సర్ గొంతు వినిపిస్తోంది.

ప్లాట్ ఫారం మీదికి అప్పుడే వచ్చిన జ్యోతి, 'సీజన్ టికెట్' వుందో లేదో అని ఓసారి హేండ్ బాగ్ తెరిచి చూసికొని, ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంవైపు దారి తీసింది.

జ్యోతి అందమైన అమ్మాయి. ఇరవై రెండు సంవత్సరాల వయస్సు. అందమైన ముఖం, చక్కటి పర్సనాలిటీ. చక్రాల్లాటి కళ్ళు చూపరుల్ని ఇట్టే ఆకర్షిస్తాయి. స్వంత ఊరు గుంటూరే అయినా, విజయవాడలో ఓ కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తూండడంవలన,రోజూ ఈ సమయానికి విజయవాడ వెళుతుంది. తిరిగి సాయంత్రం నాలుగునుండి ఏడుగంటలవరకూ వున్న షటిల్ సర్వీస్‌లో తిరిగి వచ్చేస్తుంది. డీసిల్ సర్వీస్ కావడంవల్లా, ముప్పైఅయిదు నిముషాలే ప్రయాణవ్యవధి అవడంవల్ల పెద్దగా శ్రమ అనిపించదు.

ప్లాట్ ఫారంమీద ట్రైన్ సిద్ధంగా వుంది. నిజానికి ట్రైన్ అన్న పేరు దానికి సరిపడదేమో. ముందు ఓ డీసిల్ కారు, దాని వెనుక రెండు మామూలు రైలుపెట్టెలు

తగిలించి వున్నాయి. డీసిల్ కారులోనే వున్న ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులోకి ఎక్కి కూర్చొన్నది జ్యోతి.

మామూలు డీసిల్ రైలింజన్లకు, డీసిల్ కార్లకు ప్రాథమికంగా ఓ తేడా వున్నది. డీసిల్ ఇంజన్లు రైలింజన్లకు మల్లే బరువైన ఇరవై ముప్ఫై కంపార్టుమెంట్లు లాగడానికి ఉపయోగపడతాయి. కాని డీసిల్ కార్లు అలా కాదు. స్థూలంగా చెప్పాలంటే రైలుపట్టాలపై ప్రయాణం చేసే బస్సుల్లాంటివి అనొచ్చు. కంపార్టుమెంట్ ముందు భాగంలో ఇంజన్ రూము వుంటుంది. వెనుకవైపు మామూలుగా ప్రయాణీకులు కూర్చోడానికి అనువుగా సీటింగ్ అమర్చబడి వుంటుంది.

మామూలుగా కంపార్టుమెంట్ బరువు లాగటానికే ఇంజన్ ఉద్దేశింపబడినా, చిన్నరూట్లలో ప్రతి డీసిల్ కారుకూ రెండు మామూలు రైల్వే కంపార్టుమెంట్లు ఎటాచ్ చేసి సర్వీసులు నడుపుతూ వుంటారు.

జ్యోతి తన సీట్లో కూలబడి ఓసారి కంపార్టుమెంటంతా కలియజూసింది. అన్నీ బస్సు సీట్లలా విడివిడిగా వున్న కుషన్ సీట్లు... మొత్తం నలభై.

పరిమళ ఇంకా రాలేదు అనుకొంది మనసులోనే. పరిమళ కూడా విజయవాడలో ఓ ప్రయివేట్ కంపెనీలో సెక్రటరీగా పనిచేస్తోంది. కిటికీ ప్రక్క సీట్లలో గురుమూర్తీ, సాంబశివరావు సిగరెట్లు కాల్చుకొంటూ లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. వాళ్ళిద్దరూ ఫుడ్ కార్పొరేషన్‌లో డెప్యూటీ మేనేజర్లు. గురుమూర్తి జ్యోతిని చూసి పలకరింపుగా నవ్వాడు.

తన వెనకసీట్లో మిస్టర్ విల్సన్ దీక్షగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' చదువుకొంటున్నాడు. ఆయన రైల్వే ఆఫీసరు.

ఇంకా రోజూ వచ్చేవాళ్ళు కాక క్రొత్తవాళ్ళు వున్నారు కొంతమంది.

తనతోపాటు రెగ్యులర్ గా ఈ ట్రయిన్ కే ఫస్ట్ క్లాస్ లో సీజన్ టికెట్ మీద వచ్చేవాళ్ళు ఇంకా నలుగురు రాలేదు. ఓసారి నింపాదిగా ఖాళీసీట్లను లెఖ్ఖబెట్టింది. ఇంకా చాలా సీట్లు ఖాళీగా వున్నాయి. ఎందుకయినా మంచిదని పరిమళ వస్తే కూర్చోడానికి ప్రక్క సీట్లో హేండ్ బాగ్ పారేసింది.

"హలో మిస్ జ్యోతీ" అన్నాడు సేతుమాధవన్ కంపార్టుమెంటులోకి ఎక్కుతూ.

"హలో మిస్టర్ మాధవన్" అన్నది జ్యోతి ముభావంగా.

సేతుమాధవన్ నవ్వుతూ జ్యోతి ఎదురుసీట్లో కూర్చొన్నాడు. సేతు అంటే జ్యోతికి వళ్ళు మంట. అత నేదో ప్రయివేట్ ట్రాన్స్ పోర్టు కంపెనీలో ఎకౌంటెంట్ గా పనిచేస్తున్నాడు. రోజూ ఈ ట్రయిన్ కే విజయవాడ వస్తాడు. అతని వెకిలినవ్వు, తినేస్తున్నట్లు చూసే చూపులూ జ్యోతికి కంపరం పుట్టిస్తాయి. తల త్రిప్పుకొని కిటికీలో నుండి రెండో నంబరు ప్లాట్ ఫారం మీదకు చూస్తూ కూర్చొంది.

స్టేషన్ లో గంట మ్రోగింది.

"ది షటిల్ సర్వీస్ యీజ్ ఎబవుట్ టు స్టార్ట్" ఎనౌన్స్ మెంటు వినిపిస్తోంది. పరిమళ ఈ వేళ ఇక రాదేమో అనుకొంది జ్యోతి.

అప్పుడే సుబ్బారావు, పరిమళా కంగారుగా కంపార్టుమెంట్ లోకి ఎక్కారు. పరిమళను చూడగానే ప్రాణం

తేచివచ్చినట్లయింది జ్యోతికి. ఆమె రాకపోతే జర్నీ అంతా సేతుమాధవన్ ఎక్స్‌రేచూపులు భరిస్తూ గడపాలి.

"హమ్మయ్యా! ట్రైను వెళ్ళిపోతుందేమో అనుకొన్నాను" అన్నది పరిమళ జ్యోతి ప్రక్క సీట్లో కూలబడుతూ.

"ఇంత సేపూ రాకపోతే ఈరోజు కిక రావేమో అనుకొన్నాను" అన్నది జ్యోతి చిన్నగా నవ్వుతూ.

డీసిల్ కారు 'గుఁయ్' మంటూ కూత వేసి చటుక్కున కదిలింది.

"ఏమండోయ్! ఈరోజు అహమ్మద్ గారు రాలేదల్లే వుందే" అన్నాడు గురుమూర్తి అందర్నీ ఓసారి కలయజూస్తూ.

"పాపం! లేటయిందేమో" అన్నారు ఎవరో.

2

స్టేషన్ ముందు రిక్షా దిగి, స్టేషన్ హాల్లోకి ప్రవేశించేప్పటికే బండి కదలబోతున్నట్లు అనౌన్సుమెంట్ వినిపించింది అహమ్మద్ కి. గబగబా గేట్లో అడ్డంగావున్న జనాన్ని తోసుకుంటూ ప్లాట్ ఫారంమీదికి పరిగెత్తాడు. డీసిల్ కార్ అప్పుడే 'గుఁయ్' మంటూ కూ తేసింది. పరుగు వేగం మరికాస్త ఎక్కువచేశాడు అహమ్మద్. ఒకటో నెంబరు ప్లాట్ ఫాం ఎంట్రెన్సుకు దూరంగా వుంటుంది.

ఒగుర్చుకొంటూ బండి దగ్గరికి వచ్చేప్పటికి బండివేగం పుంజుకొంది. ఫస్ట్ క్లాస్ అందుకోనే ఆశ లేదు అనుకొన్నాడు చటుక్కున సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్లోకి వ్రేళ్ళాడుతూ ఎక్కి.

కాలు కదపడానికి చోటు లేకుండా వుంది సెకండ్ క్లాస్ కంపార్టుమెంటు. సీట్లమీద కాకుండా పాస్ వే

లోనూ, తలుపులదగ్గరా టిఫిన్ కారియర్లు, సంచులూ చేత్తో పట్టుకొని నిలబడివున్నారు జనం. రోజూ ఇలానే వుంటాయి సెకండ్ క్లాస్ పెట్టెలు. అందుకే తను మూడు రెట్లు ఎక్కువయినా ఫస్ట్ క్లాస్ సీజన్ తీసుకున్నది. ఏం చేస్తాం! ఆలస్యంగా వచ్చినందుకు పనిష్మెంట్ అను కొన్నాడు ముక్కుకు కర్చీఫ్ అడ్డం పెట్టుకొంటూ.

తను లేటుగా రావడం తన అదృష్టమనీ, సెకండ్ క్లాస్‌లోకి ఎక్కడం పనిష్మెంటు కాదనీ అహమ్మద్ గ్రహించడానికి ఇంకా సమయం వుంది.

బండి మంగళగిరిలో ఒక్క నిమిషం మాత్రం ఆగింది పదిహేను నిముషాల రన్ తరువాత.

బండి ఆగీఆగగానే దిగి ఫస్ట్ క్లాస్ ఎక్కుదామనుకొన్న అహమ్మద్ ఆశ నిరాశ అయింది. బండి ఆగీ ఆగడంతోనే మరో ఇరవైమంది ఉప్పెనలా పెట్టెలోకి ఎక్కగానే అహమ్మద్ దిగడానికి వీల్లేకపోయింది. అలవాటున్నవాళ్ళు అంత తొక్కిడిలోనే దిగిపోవడం అహమ్మద్ చూస్తూ కూడా అనుకరించలేకపోయాడు.

ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్లో ఇద్దరు క్రొత్త వ్యక్తులు ఎక్కారు. ముందు ఓ పెద్ద ట్రంక్ పెట్టెను లోపలికితోసి వెనకే ఎక్కారు వాళ్ళు.

పేపరు చదువుకొంటున్న విల్సన్ ముఖం చిట్లించి చూశాడు వాళ్ళవైపు. ఫస్ట్ క్లాస్‌లో ఎక్కదగ్గ మను షుల్లా కనిపించలేదు అతనికి వాళ్ళిద్దరూ.

ఒకడు బలిష్టంగా, కండలు తిరిగి బాక్సర్‌లా వున్నాడు. ఎత్తు దాదాపు ఆరడుగులు వుండొచ్చు. ముఖ మంతా ఎర్రగా కందిపోయినట్లు వుంది. వెనక్కి దువ్వు కొన్న తల, వత్తుగా గడ్డం మీసాలు పెరిగివున్నాయి.

సిమెంటు కలరు పాంటుమీద ఆరేంజు షర్టు ఇన్‌షర్టు చేశాడు. చేతికి పాతకాలంనాటి దీర్ఘచతురస్రంగా వున్న గడియారం వుంది.

రెండో వ్యక్తి సన్నగా తీగెలా వున్నాడు. స్కైబ్లూ కలర్ జీన్స్ వేసుకొన్నాడు. ఆరేంజు ఓపెన్ షర్టు. మెడలో చిన్నిచిన్ని శంఖులతో చేసిన దండ వ్రేల్లాడుతోంది. వయసు పాతిక మించదనిపిస్తోంది.

భారీ పర్సనాలిటీ తలుపు దగ్గరగావున్న సీట్లో కూలబడ్డాడు. అతడి పేరు విక్రం. రెండో అతనుమాత్రం అలానే నిలబడి అందరినీ ఓసారి పరీక్షగా చూశాడు. అతని పేరు గనీ.

బండి మంగళగిరి స్టేషన్ దాటి అయిదు నిముషాలయింది. కృష్ణా సిమెంటు హాల్టు దాటి మెల్లిగా వేగం తగ్గింది. ఇక్కడినుండి కృష్ణా కెనాల్ స్టేషన్ చేరుకొనేలోపల దాదాపు డెభ్భై డిగ్రీలు వంపు తిరుగుతుంది రైలు మార్గం. ఎంత పెద్ద ట్రెయినయినా ఈ వంపులో స్పీడు తగ్గించుకొని మెల్లిగా పోవలసిందే.

"ఎవరో రౌడీ వెధవల్లా వున్నారు" అన్నది పరిమళ నిలబడి సిగరెట్టు వెలిగించుకొంటున్న జీన్స్ యువకుడిని చూస్తూ గుసగుసలుగా.

"పెద్ద పెట్టెలో సహా ఎక్కారు. అసలు టిక్కెట్టు వుందో లేదో" అన్నాడు సేతుమాధవన్ ఆడాళ్ళతో మాటలు కలపడానికి.

మరో అయిదు నిముషాలు గడిచాయి.

బండి వంపు పూర్తిగా తిరిగి వేగం పుంజుకొంది. కృష్ణా కెనాల్ స్టేషన్ వచ్చేసింది. స్టేషన్ మాస్టర్ ప్లాట్‌ఫాం మీద నిలబడి 'ఆల్‌క్లియర్' అని పచ్చ జండా చూపిస్తు

న్నాడు. ఆ స్టేషన్‌లో బండి ఆగదు. దాని తరువాత కృష్ణా నదిమీద వంతెన దాటితే విజయవాడే.

బండి కృష్ణా కెనాల్ స్టేషన్ దాటగానే లేచి నిలబడ్డాడు విక్రమ్. ఒక్క క్షణం అందరివైపు చూసి డ్రైవర్ కాబిన్ వైపు చకచకా అడుగులు వేశాడు.

డ్రైవర్ కాబిన్‌కు, కంపార్ట్‌మెంట్ సీట్లకు మధ్య రెండు లావెటరీలు వున్నాయి. లావెటరీ మధ్యగా వున్న సందు నుండి డ్రైవర్ కాబిన్ ఓ చిన్న తలుపుద్వారా కనెక్ట్ చేయబడి వుంది. డోర్ దగ్గరికి వెళ్ళి హేండిల్ తిప్పాడు విక్రమ్. డ్రయివర్ అవతల లాక్ చేసుకొని వుండాలి తెరుచుకోలేదు.

రైల్వే కంపార్ట్‌మెంట్స్ అన్నిటికీ టూవే లాక్స్ వుంటాయి. అంటే లోపల్నుండి, బయట నుండి తాళం వేసుకోడానికి వీలవుతుందన్నమాట. జేబులోనుండి సన్నని రాడ్‌లా వున్న తాళంచెవి కీ హోల్‌లో పెట్టాడు.

అదే సమయంలో కంపార్ట్‌మెంట్ వెనుకవైపు సీట్లలో నుండి రాజా, జానీలు లేచి నిలబడ్డారు. లేచి నిలబడినప్పుడు బలిష్టంగా, ప్రత్యేకంగా కనిపించినా మొదటి నుండీ కంపార్ట్‌మెంట్‌లో కూర్చొని వుండడంవలన వాళ్ళిద్దర్నీ ప్రత్యేకంగా ఎవరూ గమనించలేదు.

కంపార్టుమెంట్‌లో అందరి కళ్లూ డ్రైవర్ కాబిన్ తెరవబోతున్న విక్రమ్‌మీదే వున్నాయి. రైల్వే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు విల్సన్ తీక్షణంగా చూశాడు. చటుక్కున లేచాడు.

"హే మిస్టర్! వాట్ ది హెల్..." అతని గొంతు మధ్యలోనే ఆగిపోయింది.

విక్రంతోపాటు మంగళగిరిలో కంపార్టుమెంట్లో ఎక్కిన గనీ చేతిలో నల్లని ఆటోమెటిక్ పిస్తోలు విల్సన్ వైపు గురిపెట్టబడివుంది.

"సిడవున్ జంటిల్‌మన్! చాకదలచుకొంటే అడుగు ముందుకు వెయ్యి" అన్నాడు తీక్షణంగా.

"యస్! ఎవ్వరూ కదలకండి..." కంపార్టుమెంట్ వెనకవైపునుండి అన్నాడు జానీ.

అందరి తలలూ ఆశ్చర్యంగా అటు తిరిగాయి. అటు చివరి రెండు తలుపులూ మూసి వాటి ప్రక్కనే నిలబడి వున్నారు రాజా జానీ లిద్దరూ.

సంభ్రమాశ్చర్యాలతో చకితులయి కళ్ళప్పగించి చూస్తున్నారందరూ.

3

డీసిల్ కార్ డ్రైవరు ధైవానందం బ్రిడ్జి అప్రోచ్ నే చూస్తూ డీసిల్‌ను పోనిస్తున్నాడు.

రెండు రైలు వంతెన్లు ప్రక్క ప్రక్కనే కనిపిస్తున్నాయి కృష్ణానదిమీద. ఒకటి చాలా ఏళ్ళ క్రితం కాటన్ దొర కట్టింది. రెండవది పదేళ్ళ క్రితం కట్టారు. ఎక్స్‌ప్రెస్ ట్రైన్స్ అన్నింటికీ పాత వంతెనకే 'వే' ఇస్తారు. క్రొత్తగా కట్టిన వంతెన్ని 'స్లోట్రాక్'అంటారు. మెల్లిగా వెళ్ళే గూడ్సు రైళ్ళు, పాజింజరు ట్రైన్సు ఆ వంతెన మీద వెళతాయి.

డీసిల్ కార్‌లో ఈ షటిల్ సర్వీసు మొదలుపెట్టిన దగ్గర్నుండీ రోజూ ఉదయం సాయంత్రం ఇదే ట్రాక్ మీద డ్యూటీ చేస్తున్నాడు తను. కళ్ళు మూసుకొని బండి నడపగలడు. స్పీడామీటర్ యాభై కిలోమీటరు

చూపుతోంది. టైము చూసుకొన్నాడు. బండి బిఫోర్ టైమ్ నడుస్తోంది. విజయవాడ చేరడానికి ఇంకా ఎనిమిది నిముషాలుంది. వంతెన దాటితే విజయవాడ స్టేషనే.

కొద్దిగా స్పీడ్ కట్ చేసి 'సైరన్ మోగించాడు రెండు సార్లు. వంతెనమీదికి బండి తీసుకెళ్ళేప్పుడు విధిగా సైరన్ మోగించాలి. వంతెన ఇంకా యాభై గజాల్లో వుంది.

విక్రమ్ ఎప్పుడు కాబిన్‌లోకి వచ్చాడో గమనించ లేదు దైవానందం. వెనక అలికిడి వినిపించగానే చటుక్కున వెనక్కి తిరిగాడు.

"ఎవరు మీరు...కాబిన్‌లోకి రాకూడదు" అన్నాడు విసుగ్గా.

బండి చప్పుడు చేసుకొంటూ బ్రిడ్జి ఎక్కింది.

"ఇంజన్ కట్ చెయ్యి" అన్నాడు విక్రమ్ పిస్తోలు గురిపెట్టి.

బండి పూర్తిగా బ్రిడ్జిమీదకు వచ్చేసింది.

ఆశ్చర్యంనుండి తేరుకోడానికి క్షణంసేపు పట్టింది దైవానందానికి. "నీకేమన్నా పిచ్చా!" అని మాత్రం అనగలిగాడు.

"షటప్ అండ్ డు యాజ్ ఐ సే! టైను ఆపకపోతే నిర్దయాత్మకంగా కాల్చి చంపేస్తాను" అన్నాడు విక్రమ్.

ఇంజన్ శబ్దంలోనూ, వంతెన శబ్దంలోనూ కూడా విక్రం గొంతులో కాఠిన్యం దైవానందాన్ని చకితుణ్ణి చేశాయి. అతని పదిహేనేళ్ళ సర్వీసులో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. కనీసం జరిగినట్లు విన్నట్లుకూడా గుర్తులేదు. కాని అవతలి వ్యక్తి గొంతు వింటోంటే

అన్నంత పనీ చేయగలడన్న నిజం మాత్రం తలకెక్కింది. మెల్లిగా చేయి కంట్రోలుమీద వేశాడు.

"మేకిట్ స్లో! మెల్లిగా అతి మెల్లిగా ఆపు" అన్నాడు విక్రమ్ అతని చేతుల్ని జాగ్రత్తగా గమనిస్తూ.

డీసిల్ ఇంజన్లవ వేగం పెంచడం, తగ్గించడం అతి త్వరగా చెయ్యొచ్చు. కంట్రోలును గట్టిగా పట్టుకొని పూర్తిగా వెనక్కి లాగాడు. ట్రైను పెద్ద శబ్దంచేస్తూ వంతెన మధ్యలో ఆగిపోయింది.

"లాక్ వెయ్యి" అన్నాడు విక్రం. లాక్ వెయ్యడం వలన వేసిన బ్రేక్ వెనక్కి జారకుండా పట్టి వుంటుంది. దైవానందం చెప్పినట్లు చేశాడు.

"ఆల్ రైట్ తలమీద రెండు చేతులూ పెట్టుకొని అలాగే నిలబడు" అన్నాడు విక్రమ్.

"ఏమిటి? ఏం జరిగింది? బండి ఆగిందెందుకూ?" రకరకాలుగా ఒకళ్ళ నొకళ్ళు ప్రశ్నించుకొంటున్నారు. చివరని అహమ్మద్ ఎక్కిన సెకండ్ క్లాస్ బోగీలో ప్రయాణీకులు.

"బహుశా సిగ్నల్ ఇవ్వలేదేమో—"

"లేదు లేదు సిగ్నల్ ఇచ్చేవుంది."

"మరెందు కాగిపోయింది? సరిగ్గా వంతెన మధ్యలో వుంది రైలు."

ఒకొక్కళ్ళు ఒకో రకమైన ప్రశ్న, సమాధానం. అహమ్మద్ విసుగ్గా టైమ్ చూసుకొన్నాడు. ఈసరికి విజయవాడలో వుండవలసింది. ఇంకా సెకండ్ క్లాస్ కంపులో ఎంతసేపు వుండాలో! అనుకొన్నాడు దూరంగా కృష్ణా బరాజ్ మీద హడావిడిగా అటూ ఇటూ పోతున్న మోటారు వాహనాలు చూస్తూ.

ఇంతలో డోర్ దగ్గర నిలబడిన వాళ్ళలో కల కలం ప్రారంభమయింది. కిటికీల దగ్గర కూర్చున్నవాళ్ళు తలలు బయటికి పెట్టి బయట చూస్తున్నారు.

"అమ్మో! డేంజరు! బండి కదిలితే చస్తాడు" అంటున్నారు ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులోనుండి మెల్లిగా వంతెనమీదికి దిగిన రాజాని చూస్తూ.

"ఏం గురూ బ్రతకాలని లేదా?" అరుస్తున్నారు గుమ్మం దగ్గర వున్నవాళ్ళు.

అహమద్ కూడా క్యూరియాసిటీ చంపుకోలేక గుమ్మం దగ్గరి చువ్వ గట్టిగా పట్టుకొని ముందుకు వంగాడు.

4

దైవానందాన్ని కాబిన్ లోనుండి బయటికి తీసుకువచ్చి అందరితోపాటు సీట్లమీద కూర్చోబెట్టాడు విక్రం.

"లుక్ మిస్టర్ ఇలా రైలును ఆపి పిస్తోళ్ళతో బెదిరించడం చట్ట విరుద్ధం" అన్నాడు విల్సన్ గొంతు పెగల్చుకొని.

విక్రం అతన్ని పట్టించుకోలేదు. తన పిస్తోలును సీట్ల పైకి గురిపెట్టి వుంచి గనీకి సైగ చేశాడు. గనీ గబగబ పెట్టె తెరిచి రెండు గ్రనేడ్లు బయటికి తీసి అందరికీ కనిపించేలా పట్టుకొన్నాడు.

"జాగ్రత్తగా వినండి" అన్నాడు విక్రం. "ఎవరూ ఏమాత్రం సీట్లలో నుండి లేవాలని ప్రయత్నించినా, హీరోయిజం చేయడానికి సాహసించినా ఆ రెండు గ్రనేడ్లు ప్రేలడం ఖాయం. అందరి ప్రాణాలు పోవడంతోపాటు వంతెన కూలి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. మేము ప్రాణాలకు తెగించే ఈ పనిని తలపెట్టాం.

కాబట్టి మాకు ప్రాణాలు ముఖ్యం కావని గుర్తుంచుకోండి" అన్నాడు.

కంపార్టుమెంట్‌లో జనం ఇంకా షాక్ నుండి తేరుకోలేదు. జరుగుతున్నదేమిటో ఎవరికీ పూర్తిగా అర్థంకావడం లేదు.

విక్రం రాజాకు ఏదో సైగ చేశాడు. రాజా తల వూపి పిస్తోలు బొడ్లో దోపుకొని బయటికి కనిపించకుండా షర్టు దానిపైకి లాక్కొని తలుపు తెరిచాడు.

కంతెన ఇనుప కమ్ముల క్రిందనుండి వర్షాకాలపు కృష్ణానది నిండుగా ప్రవహిస్తోంది. మెల్లిగా తలుపుకు అటూ ఇటూ వున్న ఇనుపరాడ్డు పట్టుకొని క్రింద స్లీపర్ల మీదికి జారాడు. అక్కడనుండి జాగ్రత్తగా ఒక్కొక్క అడుగే వేస్తూ వెనక్కి జరిగాడు.

వెనుక సెకండ్ క్లాస్ బోగీలోని జనం రాజాను చూసి గోలగా అరుస్తున్నారు.

రాజా వాళ్ళవైపు చూసి, "వాక్యూమ్ లీక్ అవుతోంది. క్షణంలో బిగిస్తాను" అన్నాడు రెండు కంపార్టుమెంట్స్ మధ్యలోకి వెళుతూ.

జనంలో కాస్త అలజడి తగ్గింది.

రాజా చకచకా వాక్యూం ట్యూబు వూడదీసి డీసిల్ కార్‌కు కనెక్టు చేశాడు. తర్వాత రెండు పెట్టెలకు మధ్య ఉండే కప్లింగ్ వూపి చూశాడు. టెన్షన్‌గా కదప లేనట్లు వుంది. డీసిల్ కారువైపున వున్న రేకుమీద పిస్తోలు పిడి తిప్పి రెండుసార్లు గట్టిగా కొట్టాడు. తను రడీగా వున్నట్లు విక్రంకు సంకేతం అది.

రాజా సంకేతం వినగానే విక్రం డ్రైవర్ కాబిన్‌లోకి వెళ్ళాడు. లాక్ తీసేసి, బ్రేక్‌ను అదిమిపట్టి రివర్స్‌గేర్

వేశాడు. బ్రేక్‌ను అలానే నొక్కిపట్టి ఇంజన్ రివర్షన్ పెంచాడు. 'గుఁయ్' మని రెండుసార్లు సైరన్ మ్రోగించాడు—రడీగా వుండమని రాజాకు సంకేతం అది.

సైరన్ వినగానే రాజా కఫ్లింగ్ జాయింట్ చేత్తో పట్టుకొని రడీగా వున్నాడు. డీసిల్ కారు సడన్‌గా ఒక్క-అరడుగు వెనక్కి జరిగి ఆగిపోయింది. సరిగ్గా అదే సమయంలో రాజా కఫ్లింగ్ ఊడతీశాడు. డీసిల్ కార్ నుండి విడిపోయిన రెండు పెట్టెలు వెనక్కి కదలడం మొదలెట్టాయి. రాజా మెల్లిగా పాక్కుంటూ కంపార్టుమెంటులోకి ఎక్కాడు.

"ఓకే!" అరిచాడు రాజా.

రాజా అరుపు వినడంతోనే విక్రం వేగంగా కార్‌ను వెనక్కి పోనిచ్చాడు. వెనక్కి జరుగుతోన్న రెండు సెకండ్ క్లాస్ బోగీల్ని వేగంగా గుద్దుకొన్నది. డీసిల్ కారు రెండు బోగీల్లో జనం హాహాకారాలు చేశారు ఆ కుదుపుకు. షంటింగ్ తోపిడికి రెండు పెట్టెలూ అతి వేగంగా వెనక్కి వెళ్ళిపోవడం మొదలుపెట్టాయి.

విక్రం మళ్ళీ బ్రేక్ వేసి లాక్ అరేంజ్ చేశాడు.

విడిపోయిన రెండు బోగీలు వెనక్కి వెళ్ళే కొలదీ వేగాన్ని పెంచుకోసాగాయి. వంతెన తరువాత ట్రైన్ పల్లంలో వుండడంలో క్షణక్షణానికీ ఇంజన్ లేకపోయినా వేగం పెంచుకొంటూ వెనక్కి పరిగెత్తసాగాయి.

నలుగురు దుండగుల ముఖాల్లోనూ చిరునవ్వు మెదిలింది.

5

విజయవాడ ఈస్ట్ అవుట్ కాబిన్ ఎ. యస్. యమ్., పాయింట్స్‌మన్ షటిల్ సర్వీస్ ట్రైన్ ఎందుకు బ్రిడ్జి మీద నుండి కదలడంలేదో తెలియక తికమక పడ్డారు.

సిగ్నల్ ఇచ్చినా ట్రైను ఎందుకు ముందుకు రావడంలేదో అర్థం కావేదు.

"సిగ్నల్ లైటు వెలగలేదేమో!" అన్నాడు కాబిన్ మాస్టర్ అనుమానంగా.

"అక్కడ లైటు వెలిగినట్లు మన కాబిన్‌లో ఇండికేటర్ బల్బు చెపుతోంది. ట్రాక్ ఫాల్ట్ ఏమన్నా వుందేమో" అన్నాడు పాయింట్స్‌మన్.

కాబిన్ నుండి అర కిలోమీటరు దూరంలో వుంటుంది వంతెన. వంతెన మధ్యలో ఆగిపోయి వుండడంవలన చూడ్డానికి కనిపించడంలేదు ట్రైను. క్యాబిన్ మాస్టరు మనసులో తెలియకుండానే ఆనీజీగా ఫీలవసాగాడు.

జూనియర్ పాయింట్స్‌మెన్ వైపు తిరిగి, "ఎందుకయినా మంచిది. నీవు ఫ్లాగ్స్ తీసుకొని వంతెనమీదకు వెళ్ళు. ఏం జరిగిందో కనుక్కో" అన్నాడు.

"కనుక్కోవడం కాదు, కాస్త హడావిడి చెయ్యి. కనీసం వార్నింగ్ సైరనన్నా ఇవ్వకుండా ఎందుకు ఆగి పోయాడో గట్టిగా అడుగు. వెనక సర్కారు ఎక్స్‌ప్రెస్ వచ్చే టైమ్ దగ్గరపడింది" అన్నాడు సీనియర్ పాయింట్స్‌మన్ గట్టిగా.

అతను తల వూపి జండాలు తీసుకొని గబగబా కాబిన్‌లోనుండి క్రిందకు దిగసాగాడు.

కాబిన్ మాస్టర్ ఫోన్ తీసి డ్యూటీ ఎ. యస్. యమ్‌ను పిలిచాడు. "హలో! ఈస్ట్ అవుట్ కాబిన్ మాస్టర్‌నండీ! షటిల్ సర్వీస్ డీసెల్ స్పీడ్ ట్రాక్ బ్రిడ్జి మీద నుండి ముందుకు కదలడంలేదు. సిగ్నల్ ఇచ్చి పావుగంటయినా అలాగే వుంది. కనీసం వార్నింగ్ సైరన్ కూడా ఇవ్వడంలేదు."

"హలో! హలో! వాట్ ది హెల్! ఏమొచ్చింది ఆ డ్రైవర్‌కి, బండి స్టేషన్‌లోకి రాగానే మెమో ఇవ్వాలి రాస్కెల్‌కి; షటిల్ లేట్ అయిందంటే మా ప్రాణాలు తోడేస్తాడు డి. యమ్" అంటున్నాడు డ్యూటీ స్టేషన్ మాస్టర్.

"పాయింట్స్‌మన్‌ని ట్రైన్ దగ్గర కెళ్ళమని ఇప్పుడే డిస్పాచ్ చేశాను."

"గుడ్...గుడ్...ఆ వెధవ త్వరగా ట్రాక్ క్లియర్ చెయ్యకపోతే ట్రాఫిక్ ఆగిపోతుంది. నేనిప్పుడే యల్. యమ్‌కి, సూపర్నెంటుకు ఇన్‌ఫాం చేస్తాను" అన్నాడు డ్యూటీ ఎ. యస్. ఎమ్ ఫోన్ పెట్టేస్తూ.

విషయం వినగానే స్టేషన్‌మాస్టర్ రాజం కుర్చీలోంచి ఎగిరిపడ్డాడు.

"కృష్ణా కెనాల్ ఎ. యస్. ఎమ్. నుండి డిపార్చర్ రిపోర్టు వచ్చిందా? ఎంత సేపయింది వచ్చి?" కరుస్తున్నట్లు అడిగాడు.

"ఎనిమిది ఇరవై ఆరుకు వాళ్ళ ఔటర్ దాటిందండి."

"మన వెధవలు సిగ్నల్ ఇచ్చారా?"

"ఇచ్చి పావుగంటయిందండి."

"వాట్స్ రాంగ్...బాస్టర్డ్స్..." ఎవర్ని తిడుతున్నాడో తనకే తెలియడంలేదు రాజంకు. "ఇలా నడిపితే సర్వీసులు నడిపినట్లే. మళ్ళా రింగ్ చెయ్యి కాబిన్ మాస్టర్‌కు" అన్నాడు హడావిడిగా.

అంటూండగానే రాజం బల్లమీది ఫోన్ మ్రోగింది. "యస్!" అన్నాడు రాజం ఫోనెత్తి.

"డిసీజ్ ట్రాఫిక్ కంట్రోల్. వాట్స్ ది మాటర్ విత్ ది షటిల్ సర్వీస్. ఇంకా బండి స్టేషన్లోకి ఎందుకు

రాలేదు'' అవతల కంట్రోలర్ గర్జిస్తున్నాడు.

"సెర్చ్ మి. అయామ్ ట్రయ్యింగ్ టు ఫైండవుట్"

ఫీంకరించాడు రాజం. బల్లమీది మరో టెలిఫోన్ మ్రోగింది. మరో చేత్తో ఆ టెలిఫోన్ అందుకొన్నాడు.

"దిసీజ్ కృష్ణాకెనాల్/డ్యూటీ యస్. ఎమ్. షటిల్ సర్వీస్ సెకండ్ క్లాస్ బోగీలు రెండు డిలింక్ అయి వెనక్కు వచ్చేశాయి'' కృష్ణా కెనాల్ స్టేషన్‌మాస్టర్ గొంతులో కంగారు స్పష్టంగా వినిపిస్తోంది.

"సెకండ్ క్లాస్ బోగీస్... వాట్'' మతిపోయినవాడికి మల్లే అరిచాడు రాజం.

"హాలో...దిసీజ్ కంట్రోల్...ఆన్సర్ మి..." అరుస్తున్నాడు కంట్రోలర్ మరో ఫోన్లో.

బయట డ్యూటీ యస్. ఎమ్. ఫోన్లు మ్రోగడం మొదలెట్టాయి. అంతా హడావిడి. గందరగోళం. విజయవాడ జంక్షన్‌లో రైల్వే ఆఫీసర్లందరూ మరో అరగంటలో గుండె దడతో చెమటలు క్రక్కుతున్నారు.

6

ట్రైన్‌లో అందరి ముఖాల వంకా పరీక్షగా చూశాడు విక్రం. అందరి భావాలూ ఒకేలా కనిపించాయి. భయం, ఆందోళన, ఏం జరుగుతుందో తెలియని అయోమయ స్థితి.

మొత్తం పాసెంజర్లను ఓసారి లెఖ్ఖపెట్టాడు. మొత్తం పదిమంది వున్నారు. ఇద్దరు ఆడవాళ్ళు, ఎనిమిదిమంది మొగవాళ్ళు. నలభైసీట్లలోనూ అక్కడక్కడా కూర్చొని వున్నారు.

"నా! లేడీస్ అండ్ జంటిల్‌మన్! మేం చెప్పినట్లు తూ. చ. తప్పకుండా చేస్తే ఎవ్వరికీ, ఏ ప్రమాదమూ జరక్కుండా ఇంటికి చేరుకోగలరు. ఏవిధమైన గలాభా

సృష్టించాలని ప్రయత్నించినా మీ ప్రాణాలను వృథాగా పోగొట్టుకొంటారు'' అన్నాడు అందరికీ వినిపించేలా గట్టిగా విక్రమ్.

"ఎవరు మీరు? ఇలా రైలును బ్రిడ్జి మధ్యలో ఆపేసి మమ్మల్ని బెదిరించడంలో మీ ఉద్దేశ్యమేమిటి?'' వణుకుతున్న గొంతుతోనే ధైర్యంగా అడిగాడు సుబ్బారావు.

"దటీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్! మేమెవరమో ఏమిటో కాసేపట్లో తెలుస్తుంది. అంతవరకూ నోరు మూసుకు కూర్చోండి'' గనీ గొంతు కంపార్టుమెంటులో ప్రతిధ్వనించింది.

సేతుమాధవన్ మనసు రకరకాల ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. వీళ్ళెవరో తమను దోచుకోవడానికి ఈ రైలు ఆపినట్లున్నారు. రాస్కెల్స్ ఎలా తప్పించుకుపోతారనో. ఆ చేతిలో వున్నవి నిజం పిస్తోళ్ళేనా? జ్యోతి దగ్గర తన వ్యక్తిత్వం పెంచుకోవాలంటే ఇదే సమయం. చటుక్కున లేచి నిలబడ్డాడు.

"స్టాప్ ది ఫన్నీ గేమ్ జంటిల్‌మన్! డ్రైవర్ని వదిలిపెట్టి రైల్ని ముందుకు పోనివ్వండి'' అన్నాడు సీటు దగ్గర్నుండి ముందుకు కదుల్తూ.

"అవును! దిసీజ్ నాన్సెన్స్! ఈ దుండగాన్ని చూస్తూ ఊరుకోకూడదు. వెనక రెండు బోగీల్ని డిలింక్ చేయడంలోనే వీళ్ళ ఉద్దేశ్యం అర్ధమవుతుంది'' అన్నాడు విల్సన్ సీటుమీదనుండి లేవకుండానే.

సేతుమాధవన్ భయంగానే రెండడుగులు ముందుకు వేశాడు.

"సిడవున్ మిస్టర్!'' ప్రశాంతంగా అన్నాడు విక్రమ్.

అందరూ సేతుమాధవన్ వంకే చూస్తున్నారు. ఉన్నట్లుండి భయం పోయి, తెగింపు వచ్చింది సేతుమాధవన్‌కి. ఇంతదూరం వచ్చాక వెనక్కి తిరిగి కూర్చోవడం అవమానకరం. జ్యోతి దృష్టిలో తను మరింత చులకన అయిపోతాడు. మరో రెండడుగులు ముందుకు వేశాడు.

రాజా, జానీ ఇద్దరూ పిస్తోళ్ళు పట్టుకొని గురిపెట్టి నిలబడివున్నారు. గనీ చేతిలో గ్రనేడ్లు జీన్ జేబులో వేసుకొని బొడ్లోంచి పిస్తోలు తీసి జనంవైపు గురిపెట్టాడు.

విక్రం అడుగు ముందుకు వేశాడు. దూరంగా ఎక్కడో రైలుకూత వినబడింది. ఇద్దరికీ మధ్య అడుగున్నర దూరం వుంది. చటుక్కున పిస్తోలు పిడి వెనక్కి త్రిప్పి మెఱపులా సేతు గడ్డంమీద గుద్దాడు విక్రం.

సేతు 'అమ్మో' అని అరిచి మనిషంతా ఎవరో ఎత్తి పడేసినట్లు వెనక్కి ఎగిరి ఉండలా కూలిపోయాడు. ప్రక్కసీట్లోని సుబ్బారావు చటుక్కున లేవబోయి, విక్రంచేతిలో పిస్తోలు చూసి రాయికిమల్లే కూర్చుండిపోయాడు.

ఎవ్వరూ కదల్లేదు. మాట్లాడలేదు. పరిమళకు భయం వల్ల, ఆందోళనవల్ల ఎక్కిళ్ళు వస్తున్నాయి. విక్రం, గనీకి సైగచేసి మళ్ళీ జనంవైపుకు తిరిగాడు.

"నేనన్న మాటలో నిజం మీకు ఇప్పుడర్థమై వుంటుంది. ఈసారి అతన్లా ఎవరైనా పిచ్చివేషాలు వెయ్యాలని ప్రయత్నిస్తే నిజంగా కాల్చి చంపుతాను... నా: ఒక్కొక్కరూ మెల్లిగా లేచి ఆమధ్య నున్న రెండు వరసల్లో కూర్చోండి. అటు అయిదుగురు, ఇటు అయిదుగురు ఎదురెదురుగా కూర్చోండి."

మెల్లిగా ఒక్కొక్కరే విక్రం చెప్పినట్లు మధ్య వరసలో వున్న పది సీట్లలో సర్దుకొన్నారు. సేతుమాధవన్ స్పృహపోయి అలానే క్రింద పడి వున్నాడు.

ఈలోగా గనీ బాక్స్‌లో నుండి రెండు లౌడ్‌స్పీకర్లు, ఆంప్లిఫైయరు, బ్యాటరీ బయటకు తీశాడు. రాజా వచ్చి ఒక స్పీకర్ని వెనకవైపుకు తీసుకెళ్ళి వెనక భాగంలో వున్న రెండు అద్దాల కిటికీల్లో ఓ అద్దం పగలగొట్టి లౌడ్ స్పీకర్‌ను వైర్‌తో కట్టేశాడు. కృష్ణాకెనాల్ వైపుకు మైక్ తిన్నగా వుంటుందన్నమాట. గనీ రెండవ మైక్‌ను డ్రైవర్ కాబిన్ కిటికీలోనుండి విజయవాడవైపుకు వుండేలా కట్టాడు. తర్వాత రెండు లౌడ్‌స్పీకర్లనూ వైర్లతో ఆంప్లిఫైయర్‌కి, బ్యాటరీకి కనెక్ట్ చేసి మైక్‌ను విక్రమ్ చేతికిచ్చాడు.

"రాజాకు ఓ కార్బయిన్ ఇచ్చి, ఒకటి కాబిన్‌లో పెట్టు" అన్నాడు విక్రమ్ గుసగుసలుగా.

గనీ పెట్టెలోనుండి రెండు కార్బయిన్‌లు బయటికి తీశాడు. చిన్నసైజు స్టెన్‌గన్స్‌లాంటివి అవి. పదిమంది మీదా పిస్తోలు గురిచేసి నిలబడ్డ జానీని చూసి చిన్నగా నవ్వి కన్నుకొట్టి రాజాకు కార్బయిన్ అందించాడు.

రాజా కార్బయిన్ తీసుకొని ఓసారి మాగజైన్ చెక్ చేసి, వెనకవైపు అద్దం పగలగొట్టి లౌడ్‌స్పీకర్ ఫిట్ చేసిన కంతలోనుండి బయటకు చూస్తూ నిలబడ్డాడు. అంటే ఇక కృష్ణాకెనాల్ వైపునుండి ఎవరు ట్రైన్‌వైపు వచ్చినా ఆ బాధ్యత రాజాదన్నమాట.

విక్రం, గనీవైపు చూసి, "టేక్ కేర్ ఆఫ్ దెమ్" అని కాబిన్‌లోకి నడిచాడు.

ఆరో పెట్టె కంపార్టుమెంట్‌లో పదిమందికీ జానీ, గనీలు కాపలా కాస్తోంటే, డీసిల్ కారు వెనకవైపు రాజా, ముందువైపు విక్రం డిఫెన్స్ వున్నారన్నమాట.

'చాలా పకడ్బందీగా వుంది వీళ్ళ ప్లాను. ఏం చేస్తారో? అసలు ప్రాణాలతో బయటపడగలమో, లేదో' అనుకొన్నాడు గురుమూర్తి గడ్డం మిటకరిస్తూ.

'ఏం చెయ్యబోతున్నారు వీళ్ళు?' అందరి మనసుల్లో అదే ప్రశ్న!!!

7

డ్రైవర్ కాబిన్లో సీట్లో కూలబడి సిగరెట్ వెలిగించాడు విక్రమ్. టైము చూసుకొన్నాడు. తొమ్మిదికి యింకా అయిదు నిముషాలుంది. బండి స్టేషన్‌లోకి రాకుండా ఇక్కడే ఆగిపోతే ఇంకా ఎవరూ రారేం అనుకొన్నాడు డ్రైవర్ సీటుకు ముందువున్న విండ్ షీల్డ్ అద్దాన్ని పైకి ఎత్తి ఆ ఖాళీ ప్రదేశంలోనుండి ట్రాక్ పొడుగునా వంతెన చివరికంటూ చూస్తూ.

దూరాన ఎవరో నీలంరంగు యూనిఫాం వ్యక్తి ఎర్ర జెండా ఊపుతూ వంతెనమీదకు రావడం కనిపించింది.

వెనక్కు తిరిగి, "ఎవరో వస్తున్నారు. జాగ్రత్తగా వుండండి" అన్నాడు.

జూనియర్ పాయింట్స్‌మన్ తనను ఇంతదూరం నడిపించిన డ్రైవర్ని తిట్టుకొంటూ జండా ఊపుతూ, జాగ్రత్తగా అడుగులువేస్తూ ట్రైన్‌కు సమీపంగా రాసాగాడు.

సరిగ్గా ట్రైనుకు యాభైగజాల దూరంలో వుండగా సైరన్ మోగించాడు విక్రమ్. పాయింట్‌మన్ ఆగిపోయి ఎర్రజెండా విపరీతంగా ఊపసాగాడు. ట్రైను ముందుకు

కదలడంలేదని గమనించగానే గబగబా ముందుకు వచ్చాడు.

కొద్దిక్షణాల్లో అతనికి కలిగే షాక్‌ను ఊహించుకొని మనసులోనే నవ్వుకొన్నాడు విక్రమ్. ట్రైను అయిదు గజాల దూరానికి రాగానే మైక్ స్విచ్ ఆన్ చేసి, కిటికీ ఖాళీలోనుండి కార్బయిన్ బయటకు పెట్టాడు.

"హలో! అక్కడే ఆగు. ఇంకా ముందుకు రాక" అన్నాడు మైక్‌లో గట్టిగా.

ఉలిక్కిపడి చటుక్కున ఆగిపోయాడు పాయింట్‌మన్. బాగా దగ్గరికి వచ్చేవరకూ అతను కిటికీ ప్రక్కనే వున్న స్పీకర్‌ని గమనించలేదు.

"ఏమిటది? బండి ఎందుకు ఆగిపోయింది" అరుస్తోన్నాడు పెద్దగా.

మైక్‌లో గట్టిగా నవ్వాడు విక్రమ్. "ఇక బండి ముందుకు రాదు. మెల్లిగా ఒక్కొక్క అడుగే వేస్తూ ముందుకు రా" అన్నాడు.

పాయింట్‌మన్‌కు తను వింటున్నది, చూస్తున్నది ఏమాత్రం తలకెక్కడంలేదు. కాని ఏదో జరగకూడనిది జరుగుతున్నట్లు మాత్రం అర్థమయింది. అలాగే నిలబడి డీసిల్ కార్ వైపు పరకాయించి చూశాడు. కాబిన్ గదిలో విక్రమ్ నిలబడి తనవైపే చూడ్డం గమనించాడు. ఎవరతను? డ్రైవరా?

"అలా నిలబడ్డావేం. మెల్లిగా ముందుకురా" అన్నాడు విక్రం మైక్‌లో.

అతను ముందుకు కదిలాడు. డీసిల్ కార్‌కు ఇంకా రెండు గజాలుండగానే తుపాకిలాంటి ఆయుధం తన వైపు గురిచేసి వుండడం చూసి చటుక్కున ఆగిపోయాడు.

"చూశావుగా, ఈ కార్బయిన్‌లో బండికి దగ్గరగా వచ్చినవాళ్ళ నెవరినయినా కాల్చి చంపొచ్చు" అన్నాడు విక్రమ్ అతన్నే పరీక్షగా చూస్తూ.

పాయింట్స్‌మన్ కాళ్ళలో వణుకు ప్రారంభమైంది. కళ్ళు తిరిగి బ్రిడ్జిమీదనుండి జారి క్రింద నదిలో పడిపోతా డేమో అనిపించింది. గుడ్లప్పగించి కార్బయిన్ వైపు చూస్తూ వుండిపోయాడు. అతను చూస్తుండగానే విక్రమ్ తెల్లటి కవరొకటి విండ్‌షీల్డ్ అద్దం ఎత్తిన ఖాళీలోంచి బయటకు పెట్టాడు.

"ఈ కవర్ని తిన్నగా తీసుకెళ్ళి మీ స్టేషన్‌మాస్టర్‌కి ఇయ్యి. వెళ్ళు" అన్నాడు ఒక్కొక్క పదమే వత్తి, స్పష్టంగా పలుకుతూ.

8

విజయవాడ డివిజనల్ ఆఫీసు కాన్‌ఫరెన్స్ రూమది. దీర్ఘచతురస్రంగా వున్న టేబిల్ ముందు రకరకాల అధికారులు కూర్చొనివున్నారు. ఎయిర్ కండిషనర్ చల్లదనం వారిలో వేడిని ఏమాత్రం తగ్గించలేకపోతోంది.

జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, టౌన్ స్పెషల్ ఆఫీసర్, పోలీస్ స్పెషల్ బ్రాంచ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్, రైల్వే తరఫున డివిజనల్ మేనేజర్, ఆర్. పి. యఫ్., డి. ఐ. జి. అందరి ముఖాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"జంటిల్‌మన్. భారత రైల్వే చరిత్రలో ఇలాంటి సంఘటన జరగడం ఇదే మొదటిసారి. అది మన డివిజన్లో జరగడం మన దురదృష్టం" అన్నాడు డి. యమ్. రాజం ఉపోద్ఘాతంగా.

"ఓ.కె. ఓ.కె. మేకిట్ బ్రీఫ్ మిస్టర్ రాజం. ఇంతకీ ఆ దుండగులు ట్రైన్ ను ఆపి పాసింజర్లను బందీలుగా తీసుకొన్నదెందుకు" అన్నాడు కలెక్టర్ అసహనంగా.

రాజమ్ తన ముందుబల్లమీద వున్న ఓ తెల్లటి కవర్ లోంచి ఓ కాగితం బయటకు తీసి మడతలు విప్పాడు.

"ఈ ఉత్తరం ట్రైన్ ఎందుకు ఆగిందో కనుక్కోవడానికి వెళ్ళిన జూనియర్ పాయింట్స్ మన్ కిచ్చి పంపించారు వాళ్ళు. స్టేషన్ మాస్టర్ ఈ ఉత్తరం నాకందించిన మరుక్షణం మీ అందరికీ ఫోన్ చేసి పిలిపించాను."

"ఏమి వ్రాశారు?"

"చదువుతాను వినండి" అన్నాడు రాజం కళ్ళజోడు ఓసారి సవరించుకొని చదవడం మొదలెడుతూ.

"డీసిల్ కార్ ఫస్ట్ క్లాస్ పాసింజర్లు, మీ డ్రైవరు మా చేతిలో బందీలు అన్న విషయం నీకు అర్థమయే వుండాలి. మూడుగంటల్లోగా పదిలక్షలరూపాయలు మాకందించకపోతే ఈ ప్రయాణీకులందర్నీ ఒక్కొక్కర్నే చంపి క్రింద కృష్ణానదిలో పారేస్తాము. ఇదీ జరగబోయే కార్యక్రమం.

అంతేకాక, మా అనుమతి లేకుండా ట్రైను సమీపంగా ఈలోగా ఎవరయినా రావడానికి సాహసించినా, మాకు ఇబ్బంది కలిగించే ఏ ఇతర ప్రయత్నాలు చేసినా, మీరు చేసే ప్రతి తప్పుకు ఓ పాసింజరు బలైపోతాడని గుర్తు పెట్టుకోండి. మీ సమాధానాన్ని వైర్ లెస్ లో 31.205 వేవ్ లెంగ్త్ మీద తెలియజెయ్యండి."

సంతకం లేదు. ఎవరో ఆర్టిస్టు వ్రాసినట్లు అక్షరాలు అందంగా, చక్కటి వరుసలో వున్నాయి. అందరూ

ఉత్తరాన్ని స్వయంగా చదివేవరకూ ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"డామిట్! ఎవరో టెర్రరిస్టుల్లా వున్నారు వీళ్ళు. దుండగులు ఎంతమందో ఏమయినా తెలిసిందా?" అడిగాడు క్రిష్ణా యస్. పి.

"లేదు. ఉత్తరం అందించిన వాణిమాత్రం మా పాయింట్స్‌మన్ చూశాడు" అన్నాడు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డి. ఐ. జి.

"ట్రైన్‌లో పాసింజర్లు ఎంతమంది వున్నారో తెలుసా?" అడిగాడు కలెక్టరు.

"ఖచ్చితంగా తెలియదు. గుంటూరునుండి ఇన్‌ఫర్మేషన్ అడిగాను. రోజూ ఓ పదిమందివరకూ ఈ ట్రైనుకు వెళతారని తెలిసింది. అదీకాక ఆ ట్రైనుకు ఈ రోజు నాలుగు ఫస్ట్‌క్లాస్ టికెట్లు అమ్మారట. మంగళగిరిలో మరో రెండు ఫస్ట్‌క్లాస్ టికెట్లు అమ్మినట్లు వార్త వచ్చిందిప్పుడే. అంటే ఆ దుండగులతో కలిపిగాని, వాళ్ళు కాకుండాగాని దాదాపు పదహారుమంది వుండవచ్చు ట్రైన్లో" అన్నాడు డి. యమ్. రాజం.

"ఓ. కె. జంటిల్‌మన్. ఇప్పుడు చెప్పండి. సెక్యూరిటీ మెజర్స్ ఏం తీసుకోవాలి? ఈ విషయం హేండిల్ చేయడానికి మీ సలహాలు ఏమిటి? వాళ్ళు నిజంగా కిరాతకులైనా కాకపోయినా, లోపలవున్న ప్రయాణీకుల దృష్ట్యా మనం అతి జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలి."

"ముందు ఆ రెండు వంతెనల ప్రాంతానికి ఎవ్వరూ వెళ్ళకుండా గట్టి కట్టుదిట్టాలు ఏర్పాటుచెయ్యాలి" అన్నాడు స్పెషల్ ఆఫీసరు.

"యస్. యస్. యూ ఆర్ రైట్. అందుచేతే

విషయం తెలియగానే వంతెన రెండువైపులకు ఓ ఆర్. పి. యఫ్. దళాన్ని కాపలాకు పంపించాను. అఫ్‌కోర్స్ స్ట్రిక్ట్ ఆర్డర్స్ ఇచ్చాను వాళ్ళకి. వంతెనమీదకు వెళ్ళకుండా అప్రోచెస్ మాత్రమే కాపలా కాయమని" అన్నాడు ఆర్. పి. యఫ్. డి. ఐ. జి.

అందరూ అంగీకారసూచకంగా తలలు ఊపారు.

"నెక్స్ట్ క్వొశ్చెన్ యీజ్ ట్రాఫిక్. బ్రిడ్జికి రెండు వైపులా ట్రాఫిక్ ఓ గంటసేపు ఆపేయమని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాను" అన్నాడు రాజం.

"వెరీ వెల్! అంతేకాదు. నేను వెంటనే స్టేట్ గవర్నమెంట్‌కి, చీఫ్ మినిష్టర్‌కి ఇన్‌ఫాం చేస్తాను. అవసరమైతే ఆర్మీ హెల్ప్ తీసుకొందాం మనం. ఆ డీసిల్ కార్లో వున్న ప్రయాణీకుల ప్రాణాలు ముఖ్యం మనకి. రైల్వే మినిస్ట్రీనుండి, హోంశాఖనుండి పాజిటివ్ ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చేవరకూ వాళ్ళను ఏదో రకంగా ఆపాలి" అన్నాడు కలెక్టర్ చకచక తన ఆలోచనలు బయటపెడుతూ.

"అవును. ఆ పదిలక్షలు ఇస్తామనే ముందు వాళ్ళకి ఇన్‌ఫాం చెయ్యాలి" అన్నాడు రాజం.

డి. ఐ. జి. కాలింగ్ బెల్ నొక్కాడు. లోపలకు వచ్చిన గార్డుతో వైర్‌లెస్ ఆపరేటర్ని లోపలకు పంపమని చెప్పాడు.

9

కాబిన్ కిటికీలోనుండి చివరికంటా కాలిన సిగరెట్‌ను బయటికి విసిరేసి, టైము చూసుకొన్నాడు విక్రమ్. తొమ్మిదిన్నరయ్యింది. ఆ ఉత్తరం వాళ్ళకు అంది దాదాపు అరగంట అయింది. వాళ్ళు సమాధానం చెప్పడానికి ఈ టైము చాలు అనుకొన్నాడు.

మరో సిగరెట్ వెలిగించి నిర్మానుష్యంగా కనిపిస్తోన్న వంతెన ముఖద్వారంవైపు చూస్తూ వుండిపోయాడు. విక్రం చూస్తూండగానే ఖాకీ యూనిఫాంలో వున్న ఆర్. పి. యఫ్. జవాన్లు వంతెన ముఖద్వారం దగ్గర, నది ఒడ్డమ్మట రైఫుల్స్ పట్టుకొని నిలబడడం కనిపించింది.

మనసులోనే నవ్వుకొని ఓసారి కార్బయిన్ మేగజైన్ సరిచూసుకొన్నాడు. వాళ్ళెవరికీ వంతెనమీదకు వచ్చే ధైర్యం వుండదని తెలుసు. ట్రైన్‌లో వుండే పాసింజర్లు తమకు ఇన్సూరెన్సు పాలసీలు.

"విక్రం!" రాజా కేక వినిపించింది వెనకనుండి. బహుశా వంతెనకు అవతలివైపునుండా ఆర్. పి. యఫ్. కాపలాకు వచ్చుండాలి.

"టేకిట్ ఈజీ! వాళ్ళు వంతెనమీదకు రారులే" అన్నాడు విక్రం వెనక్కి తిరిగి.

"నో...నో...కొంతమంది అవతల వంతెనమీదకు వస్తున్నారు" అరిచాడు రాజా జవాబుగా.

'ఫూల్స్! ఆ బెటాలియన్ ఇన్స్పెక్టర్ యెవడో ఆర్డర్స్ సరిగా అర్థంచేసుకొని వుండడు' అనుకొన్నాడు విక్రం ఓసారి వంతెన పొడవునా చూసి కంపార్టుమెంటులోకి వస్తూ.

విక్రంను చూసి గనీ ఏం చేద్దామన్నట్లు చూశాడు. తొందరపడవద్దన్నట్లు కళ్ళతోనే సైగచేసి కిటికీలోనుండి జాగ్రత్తగా అవతలి వంతెనవైపు తొంగిచూశాడు. నలుగురు ఆర్. పి. యఫ్ జవాన్లు వంతెన ఇనుపకమ్మీలవెనుక నక్కుతూ మెల్లిగా ట్రైనుకు సమీపానికి వస్తున్నారు.

"కిటికీ షట్టర్లు మూసేయి" అన్నాడు జానీవైపు చూసి విక్రం.

జానీ చకచక కిటికీలకు వుండే ఇనుప పట్టర్లు క్రిందికి దించేశాడు. గనీమాత్రం తన పిస్తోలు ప్రయాణీకులమీద నుండి ప్రక్కకు తిప్పలేదు.

"విక్రం! దె ఆర్ కమింగ్ వెరీ క్లోజ్" అరిచాడు రాజా అసహనంగా.

"టేకిట్ ఈజీ మాన్. నేను ముందు వాళ్ళకు వార్నింగ్ ఇస్తాను. నువ్వు తొందరపడకు" అన్నాడు వంగి తెరిచివున్న బాక్స్‌లోనుండి వైర్‌లెస్ ట్రాన్స్ రిసీవర్ బయటకు తీసి తనతోపాటు కాబిన్‌లోకి తీసుకు వెళుతూ.

ట్రాన్స్ రిసీవర్ ఓ ప్రక్కన పెట్టి, అంతకుముందే అరేంజ్ చేసివున్న మైక్‌ను చేతిలోకి తీసుకొని కాబిన్ విండోలోంచి బయటకు తొంగిచూశాడు విక్రం.

ఒక ఆర్. పి. యఫ్. జవాను అప్పటికే కృష్ణా కెనాల్ వైపునుండి అవతల వంతెనమీద ట్రైన్‌కు వందగజాల దూరంలోకి వచ్చేశాడు.

విక్రం మైక్ స్విచ్ ఆన్ చేసి, "ఆర్. పి. యఫ్. ప్లీజ్ గెట్ బాక్! వంతెనమీద వున్న నలుగురు జవాన్లూ వెంటనే వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలి. ఐ రిపీట్! ప్లీజ్ గెట్ బాక్" అరిచాడు. విక్రం అరుపు వంతెనమీద ప్రతిధ్వనించింది.

క్రొత్త వంతెనమీద మెల్లిగా ముందుకు జరుగుతోన్న ఆర్. పి. యఫ్. జవాన్లు నలుగురూ శిలాప్రతిమల్లా నిలబడి పోయారు. విక్రం కొద్దిగా తల త్రిప్పి విజయవాడవైపు చూశాడు. లౌడ్‌స్పీకర్లు డీసిల్ కార్‌కు రెండువైపులా అమర్చడంవలన మైక్‌లో ఏం చెప్పినా రెండు పక్షాల

వాళ్ళకూ వినిపిస్తుంది. పదిమంది ఆర్. పి. యఫ్. లు విజయవాడవైపు నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"క్రొత్త వంతెనమీదకు వచ్చిన ఆర్. పి. యఫ్. లు వెంటనే వెనక్కి వెళ్ళిపోవాలి. దిసీజ్ లాస్ట్ వార్నింగ్" అరిచాడు విక్రం మళ్ళీ.

అయినా వంతెనమీద జవాన్లు కదల్లేదు. ఇనపకమ్మీల్ని అడ్డంగా వుంచుకొని అలానే నిలబడిపోయారు. నిముషం పాటు అలానే చూశాడు విక్రం. అవతలి వంతెనమీద కదలిక లేదు. విక్రం ముఖం విసుగుకొంది.

అందరికన్నా ముందువున్న ఆర్. పి. యఫ్. రెండు చేతుల్లో రైఫుల్ పట్టుకొని మెల్లిగా ఇనపకమ్మీలమీద పాక్కుంటూ ముందుకు జరుగుతున్నాడు. వెనక ముగ్గురూ స్థంభాల వెనక నిలబడి వుండడం లీలగా కనబడుతోంది.

"రాజా! ముందు వచ్చేవాణ్ణి నాకొదిలెయ్! వెనక ముగ్గుర్నీ నువ్వు చూసుకో" అన్నాడు విక్రం కార్బయిన్ పొజిషన్లోకి తెచ్చుకొంటూ...

"ఓ. కె." అన్నాడు రాజా.

విక్రం చెయ్యి ట్రిగ్గర్ మీద బిగుసుకొంది. మరుక్షణం రెండు వంతెనలూ కార్బయిన్ గుళ్ళ ప్రేలుళ్ళతో మారు మ్రోగాయి.

ముందు వస్తోన్న ఆర్. పి. యఫ్. శరీరం కార్బయిన్ గుళ్ళతో తూట్లుపడి, వంతెన కమ్మీల మధ్యనుండి జారి కృష్ణా ప్రవాహంలో పడి సుళ్ళు తిరుగుతూ కొట్టుకు పోసాగింది.

10

"వాళ్ళను వంతెనమీదకు వెళ్ళమని ఆర్డరిచ్చిన ఫూల్ ఎవడు? ఆ వెధవను పట్టుకొని వెంటనే డిస్మిస్ చేసి తోలు

వలిచేయండి'' అరుస్తున్నాడు డి. యమ్. రాజం వంతెన మీద కాల్పుల వార్త చేరగానే.

"యస్. యస్. ఇన్ స్పెక్టర్‌ని రిలీవ్ చేసి నెక్స్ట్ సీని యర్‌కు ఇంచార్జి ఇమ్మని ఇప్పుడే మెసేజ్ పంపాను'' అన్నాడు డి. ఐ. జి.

"రిలీవ్ చెయ్యడమా? డామిట్. కాల్చిపారేయాలి వెధవని. వంతెనమీదకు వెళ్ళవద్దని స్ట్రిక్ట్ ఆర్డర్స్ ఇచ్చినా తల కెక్కించుకోలేదంటే ఏమనుకోవాలి? గ్రాస్ ఇన్ సబార్డినేషన్ రాస్కెల్'' పిచ్చి కోతిలా గంతులేస్తు న్నాడు రాజం.

"ఎనీ కాజువాల్టీస్?'' అడిగాడు సిటీ స్పెషల్ ఆఫీ సరు.

"వన్ డెడ్. వన్ ఊండెడ్. మిగిలిన ఇద్దరూ వెనక్కి పారిపోయొచ్చారు. నీళ్ళలోకి పడిపోయినతను చనిపోయా డని ఊహిస్తున్నాము. బాడీకోసం వెతుకుతున్నారు. గాయపడిన మరో జవాన్ ఇంకా వంతెన మధ్యలో అలానే వున్నాడు'' అన్నాడు డి. ఐ. జి.

"మైగాడ్! సీరియస్ వూండ్ అయితే బ్లీడింగ్ వల్ల రక్తం కారి అతను చనిపోవచ్చు. డూ సమ్ థింగ్ టు గెట్ హిమ్ బ్యాక్'' అరిచాడు రాజం కీచుగా.

రాజం కోపంగా ఓ మూల కూర్చొని ఓపిగ్గా బ్రైన్ హైజాకర్స్‌కి మెసేజ్ సిగ్నల్స్ పంపుతున్న సిగ్నల్ మన్ వైపు తిరిగాడు.

అదే సమయంలో___

"కాలింగ్ డీసిల్ సర్వీస్ ఆన్ థర్టీవన్ పాయింట్ జీరో ఫైవ్ ... కాలింగ్ ...?'' పిలిచాడు సిగ్నల్ మన్ వాల్యూం పెంచుతూ.

రిసీవింగ్ సెట్‌లో కరకర ఏదో శబ్దం అయింది.
"డిసీజ్ డీసెల్ సర్వీస్ రిసీవింగ్...డు యు రీడ్ మి" అవతలనుండి విక్రం గొంతు వినిపించింది.

"యస్...యస్...వియ్ రీడ్ యు లౌడ్ అండ్ క్లియర్...గో హెడ్..." అన్నాడు సిగ్నల్‌మన్.

"గుడ్! ఇకనుండి మన కమ్యూనికేషన్స్‌కు కోడ్ వర్డు 'ఆపరేషన్ మిలియన్' అర్థమయిందా? రిపీట్" అవతల విక్రం గొంతు.

"కోడ్ వర్డ్ ఆపరేషన్ మిలియన్...గో ఎ హెడ్!"

"గుడ్! ఇంచార్జి ఎవరు?" అడిగాడు విక్రం.

సిగ్నల్‌మన్ రాజంకు మౌత్ పీస్ అందించాడు."డిసీజ్ జనరల్ మానేజర్ రాజం! మీ ఉత్తరం అందింది."

"గుడ్ మిస్టర్ డి. యమ్. ఉత్తరం జాగ్రత్తగా చదివారు కదా? ఇప్పుడు సరిగ్గా తొమ్మిదినలభైఅయిదు అయింది. ఇంకో రెండు గంటల్లో...అంటే పదకొండూ నలభైఅయిదుకల్లా పది లక్షల రూపాయలు మాకు ఇవ్వకపోతే ఈ డీసెల్ కారులో వున్న ప్రయాణీకుల ప్రాణాల మీద మీరు ఆశ వదులుకోవచ్చు."

"లుక్ మిస్టర్! నా బాధ్యతగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నారు. ఇలా దౌర్జన్యంచేసి ఆ డబ్బు తీసుకొని మీరు తప్పించుకొని పారిపోలేరు. ఇప్పటికే మీ దౌర్జన్యానికి ఓ మనిషి చనిపోయాడు. ఇప్పటికయినా లొంగిపోతే శిక్ష తగ్గుతుంది. నేరం చేసి తప్పించుకోలేరు మీరు" అన్నాడు రాజం గుళ్ళో స్వాములవార్లా.

"కట్ ది క్రాల్" విక్రం గొంతు గర్జించింది. "తప్పించుకొనే విషయం మాకొదిలేయ్. మీ ఆర్. పి. యఫ్ మనుషులు మేము చేసిన హెచ్చరిక వినకుండా

ముందుకు వచ్చిన ఫలితం చూశారుగా. మరో రెండు గంటల్లో పది లక్షలూ అందకపోతే మరో శవానికి మీరు అంత్యక్రియల ఏర్పాట్లు చెయ్యాల్సి వుంటుంది."

"నో...నో...అలాంటి పని చేయకండి. మీ పది లక్షలూ ముట్టచెప్తాము. కాని రెండుగంటల వ్యవధి చాలదు. మరో మూడు గంటలు. అంటే రెండూనలభై అయిదువరకూ ఆగండి. పది లక్షలు ఒకేసారి సమకూర్చాలంటే కష్టం..." రాజం దీనంగా బ్రతిమాలుతున్నాడు.

"నథింగ్ డూయింగ్. పదకొండూ నలభైఅయిదుకల్లా పది లక్షలు మాకందాలి. మరో విషయం. ఆ పదిలక్షలు చిన్న చిన్న నోట్ల రూపంలో కావాలి. అయిదులు, రెళ్ళు, ఒకట్ల రూపంలో కావాలి. పదులైనా పర్వాలేదు. అంత కన్న పెద్ద విలువ నోట్లు అక్కరలేదు. డబ్బు సేకరించేప్పుడు ఈ విషయం గుర్తుంచుకో..."

గదిలో సంభాషణ వింటున్న వాళ్ళందరికీ ఒక్క క్షణం వూపిరి ఆగినట్లయింది. పది లక్షల విలువకు చిల్లర నోట్లు తేవడం అంత తేలికయిన పని కాదు.

"సీ...మిష్టర్...బి రీజనబుల్! అంత పెద్ద మొత్తం చిల్లర నోట్లలో దొరకాలంటే కష్టం..." రాజం దీనంగా ప్రాధేయపడుతున్నాడు.

"దొరక్కపోతే ఉరి పోసుకో! మరో విషయం...ఆ నోట్లలో వేటికీ సీరియల్ నంబర్లు వుండకూడదు. అన్ని పాత నోట్లు కావాలి. గుర్తుంచుకో. కాల్ యూ ఎట్ క్వార్టర్ టు ట్వెల్వ్...గుడ్ బై!" విక్రమ్ స్విచ్ ఆఫ్ చేశాడు.

"డామ్...బగ్గర్ ... స్వయిన్...పిగ్ ... బాస్టర్డ్."

నోటికొచ్చినట్లు తిడుతున్నాడు రాజం పిచ్చెక్కినవాడికి మల్లే.

బ్రౌన్ స్పెషలాఫీసర్ రాజం చెయ్యి పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టాడు. "డోంట్ లూజ్ యువర్ హెడ్! వెంటనే బోర్డు వాళ్ళకు ఈ విషయం తెలియచేయండి" అన్నాడు.

రాజం నిముషంపాటు అతనివైపు గుడ్లప్పగించి చూశాడు. తరువాత కోపంనుండి తేరుకొని సిగరెట్ వెలిగించాడు.

"యస్...యు ఆర్ రైట్" అన్నాడు గబగబా రైల్వే బోర్డ్‌కి ఓ మెసేజ్ వ్రాసి మెసింజర్ చేతికిస్తూ.

"అంతే కాదు. రైల్వే మినిస్టర్ నుండి ఆ డబ్బు వాళ్లకు ఇమ్మని క్లియరెన్స్ వస్తే, ఆ పది లక్షలూ మన దగ్గర సిద్ధంగా వుండాలి. వెంటనే స్టేట్ బాంక్‌కు ఇతర బాంకులకు ఫోన్ చేసి చిల్లర నోట్లన్నీ అట్టిపెట్టమని చెప్పండి" అన్నాడు స్పెషల్ ఆఫీసరు.

"యస్ యస్. నిజమే" అన్నాడు రాజం టెలిఫోన్ ముందుకు లాక్కొని.

అరగంటలో విజయవాడ, గుంటూర్లలో వున్న అన్ని పెద్ద బ్యాంకులకూ కాష్‌కోషం రిక్విజిషన్ పంపాడు.

11

విక్రం కొట్టిన దెబ్బకు స్పృహతప్పి పడిన సేతు మాధవన్‌కు మరో అరగంటవరకూ స్పృహ రాలేదు. తెలివి వచ్చిన తరువాత కూడా, నీరసంవల్ల, అవమానంవల్ల మరి కాసేపు అలానే క్రింద పడివున్నాడు. తర్వాత మెల్లిగా లేచి కూర్చున్నాడు మూలుగుతూ ప్రయాణీకులు కూర్చున్న రెండు వరసల మధ్య.

"ఆ మధ్యలో నుండి లేవకు. అలాగే కూర్చో" అన్నాడు గనీ తన పొజిషన్ ఏమీ మార్చకుండానే.

షట్టర్లు దించివేయడం వలన లోపల కాస్త చీకటిగా ఉక్కగా వుంది. ప్రయాణీకులందరి మనస్సుల్లో ఆందోళన తగ్గి, ఏం జరుగుతుందోనన్న భయం, ఆతృత పెరుగుతున్నాయి. విక్రం ట్రాన్స్ రిసీవర్‌లో చేసిన సంభాషణ అందరికీ వినిపిస్తూనే వుంది.

సేతుమాధవన్‌ని చూసి జీవితంలో మొట్టమొదటిసారిగా జాలిపడ్డది జ్యోతి. హీరోయిజం కోసం కాని, లేక నిజంగానే కానీ, ఆమాత్రం ధైర్యం చూపగలవాళ్ళు మిగిలిన మొగాళ్ళలో ఎవరూ లేకపోయారు. కాల్పులు జరిగినప్పటినుండి అందరూ ఊపిరి పీల్చడం కూడా మానేసినట్లు ఒకరి ముఖాలొకరు చూస్తూ శిలాప్రతిమలకి మల్లే సమయం గడుపుతున్నారు.

'పాపం మాధవన్‌కి ఎవరైనా మంచినీళ్ళు ఇప్పిస్తే బావుణ్ను!' అనుకొంది జ్యోతి.

ప్రక్కనే కూర్చొన్న పరిమళ సొమ్మసిల్లిపోయినదానికి మల్లే సీటులో జారగిలబడి కళ్ళు మూసుకొని వుంది.

సేతుమాధవన్ పెదాలు తడుపుకొంటున్నాడు నాలికతో. ఎడమ చెంపమీద దెబ్బ తగిలిన చోట నల్లగా కమిలిపోయి కనిపిస్తోంది.

"మిస్టర్ విక్రం...అతనికి కాస్త మంచినీళ్లు ఇప్పించండి" అన్నది జ్యోతి విక్రంవైపు చూసి.

క్షణంపాటు ఆశ్చర్యపోయాడు విక్రం ఆమెకు తన పేరెలా తెలిసిందా అని. మళ్ళీ గుర్తొచ్చింది ఇందాక రాజా తనను పేరుతో పిలిచినట్టు.

విక్రం క్షణంసేపు తటపటాయిస్తూ వుండిపోయాడు. నీళ్లు టాయిలెట్‌లో వుంటాయి. మాధవన్‌ని అందులోకి వెళ్ళనివ్వాలి లేదా తనన్నా తెచ్చివ్వాలి. కాని మాధవన్ ముఖంవైపు చూడగానే మళ్ళీ అతనికి తెలియకుండానే కోపం వచ్చింది. పిస్తోళ్ళు చూసి కూడా హీరోయిజమ్ ప్రదర్శింపబోయాడు వెధవ! మంచినీళ్లు లేకపోతే చావడు లే అనుకున్నాడు.

"సారీ లేడీ! వెధవ పన్లు చేసేవాళ్ళకి పనిష్మెంట్ వుండాలి" అన్నాడు తల అడ్డంగా వూపుతూ.

సమయం భారంగా గడిచింది. విక్రం చేతిగడియారం వంక చూసుకొన్నాడు. రైలు పెట్టెలో వున్న ప్రతివాళ్లూ గడియారాల వంకే చూస్తున్నారు. పదకొండు ముప్పావు దగ్గర పడుతోంది. ఏమవుతుందో అన్న ఆలోచన ప్రయాణీకుల గుండెల్లో రైలు పరిగెత్తిస్తోంది.

పదకొండు ముప్పావుకు ఇంకా మూడు నిముషాలుంది.

విక్రం కాబిన్‌లోకి వెళ్ళి జానీని కంపార్టుమెంటులోకి పంపించాడు. డీసిల్ కార్ విండ్‌షీల్డ్‌లోనుండి బయట ప్రపంచాన్ని ఓసారి పరికించి చూశాడు.

కృష్ణా రైలువంతెనమీద డీసిల్ కారు ఎవరో దుండగులు స్వాధీనం చేసుకొన్నారనే విషయం తెలియగానే వూళ్లో జనమంతా తండోపతండాలుగా కృష్ణానది ఒడ్డుకు చేరారు. ఇసుక వేస్తే రాలనట్లు విజయవాడవైపు ఒంతెనకు ఇరువైపులా నది ఒడ్డునా బారేజిమీదా నిలబడి బ్రిడ్జికేసి చూస్తోన్న జనాన్ని చూస్తోంటే విక్రంకు ఒళ్ళు మండింది.

జనం ముందుకు తోసుకు రాకుండా పోలీసులు నానా అవస్థలు పడడం కనిపిస్తోంది. అంతా గోలగా, తిరునాళ్లాగా వుంది. బండిలో చిక్కుపడిన ప్రయాణీకులమీద

జాలికన్నా, ఏం జరుగుతుందో చూద్దాం అనుకొనేవాళ్లే ఎక్కువున్నారు జనంలో.

పదకొండు ముప్పావయింది. ట్రాన్స్ రిసీవర్ స్విచ్ ఆన్ చేశాడు.

"ఆపరేషన్ మిలియన్ కాలింగ్...ఆపరేషన్ మిలియన్ కాలింగ్..." డి. యమ్. గదిలో సిగ్నల్‌మన్ గొంతు వినిపిస్తోంది.

"ఆపరేషన్ మిలియన్...రిసీవింగ్...గో ఎ హెడ్" జవాబిచ్చాడు విక్రం.

"దిసీజ్ డివిజినల్ మానేజర్" రాజం లైన్లోకి వచ్చాడు.

"ఓ. కే...కాష్ రడీ అయిందా?" అడిగాడు విక్రం.

క్షణంసేపు రాజం మాట్లాడలేదు. "సారీ మిష్టర్! మాకు ఇంకా స్తవ్యవధి కావాలి. పది లక్షలు చిల్లరనోట్లు పోగుచెయ్యాలంటే తేలిక పని కాదని నీకు తెలుసు. మాకు కనీసం మరో మూడు గంటలు టైం కావాలి. కాష్ ఇంకా దొరకలేదు." రాజం కంఠంలో ఆత్రుత, వేడుకోలు కనిపిస్తున్నాయి.

"అయితే ఓ పాశింజరు పోయినట్లే లెక్క వేసుకోండి. మరో నిముషంలో శవం అప్పజెపుతాను" అన్నాడు విక్రం ధృఢంగా.

"హలో...హలో ... ప్లీజ్ ... ప్లీజ్ ...దయచేసి నా మాట వినండి. ఉయార్ ట్రైయింగ్ అవర్ బెస్ట్...మరి కాస్సేపు ఓపిక పట్టండి. మూడు గంటలకల్లా పదిలక్షలూ మీకు అప్పజెపుతాను" రాజం గొంతులో సన్నని ఏడుపు జీర వినిపించింది.

'పూర్ బాస్టర్డ్' అనుకొన్నాడు విక్రం మనసులో.
తను చెప్పిన టైమ్‌లో వాళ్ళు కాష్ తేలేరని తనకు తెలును. కాని అలా బెదిరించకపోతే పది రోజులకయినా కాష్ తన చేతికి వచ్చే నమ్మకం లేదు.

"ఓ. కె...ఓ. కె...మరో మూడు గంటలు...నో మోర్...ఈలోగా నాకు కాష్ అందించకపోతే ఈసారి రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్‌కి రెండు శవాలు అప్పచెపు తాను. రిమెంబర్. మూడు గంటలలోగా కాష్ మాకు అందాలి" కఠినంగా అన్నాడు విక్రం.

"థాంక్యూ మిస్టర్! థాంక్యూ వెరీమచ్! ప్లీజ్ షో సమ్ రిస్ట్రెయింట్! డబ్బు మీకు అందుతుంది" అన్నాడు రాజం.

"యు బెటర్ కీప్ యువర్ వర్డ్. లేకపోతే ఇద్దరు మనుషుల చావుకు నీవు కారణమవుతావు" అన్నాడు, విక్రం స్విచ్ ఆఫ్ చేస్తూ.

స్విచ్ ఆఫ్ చేసి చటుక్కున ఏదో గుర్తొచ్చి మళ్ళీ ట్రాన్స్ రిసీవర్ ఆన్ చేశాడు.

"హలో..." అన్నాడు అవతల ఇంకా రాజం సెట్ దగ్గరే వున్నాడు.

"హలో...హలో...ఏమిటి చెప్పండి!" రాజం గొంతులో మళ్ళీ ఏ మొచ్చి పడుతుందో అనే ఆతృత కనిపిస్తోంది.

"ఇరవై మందికి సరిపడా డబుల్ టిఫీను, కాఫీ కావాలి. పాపం పాసింజర్లు ఉదయంనుండీ ఏం లేకుండా వున్నట్లున్నారు. నువ్వు డబ్బు పంపకపోతే వాళ్ళు చావడం ఖాయం అయినా ఖాళీ కడుపుల్తో వాళ్ళను చంపడం నాకు ఇష్టంలేదు" అన్నాడు విక్రం.

అవతల రాజం గొంతులో ఎంతో రిలీఫ్ కనిపించింది.
"ష్యూర్ మిస్టర్! వెంటనే పంపిస్తాను. కానీ..."

"ఎలా పంపించాలనా? చెపుతాను విను. వాటన్నిటినీ పాక్ చేసి, పైకి కనిపించేలా ఓ పళ్లెంలో పెట్టి, కెటిల్ నిండా కాఫీ పోసి పంపించు. నో ఫన్నీ బిజినెస్. పదార్థాలు తెచ్చే వ్యక్తి తప్ప ఇంకెవరూ బ్రిడ్జిమీదకు రాకూడదు. ఆ వచ్చేవాడి వంటిమీద మొల కప్పడానికి 'డ్రాయరు' తప్ప మరేమీ వుండకూడదు. అండర్‌స్టాండ్" చెప్పాడు విక్రం.

"యస్. యస్. అర్థమయింది" అన్నాడు రాజం వణుకుతున్న గొంతుతో.

12

స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ జీపులోనుండి క్రిందకు దిగి ఓసారి చుట్టూ చూశారు.

చుట్టూ జనసముద్రం. పెద్దలు, పిల్లలు, ఆడా, మగా అందరూ ఒకర్నొకరు త్రోసుకొంటూ, తొక్కుకొంటూ, అరచుకొంటూ కృష్ణా రైలుబ్రిడ్జికేసి వింతగా చూస్తూ వున్నారు కృష్ణ ఒడ్డునే.

బ్రిడ్జికి సమీపంలో నిలబడి ఇన్‌స్ట్రక్షన్సు యిస్తున్న డి. ఐ. జి. దగ్గరకు నడిచారు స్పెషల్ బ్రాంచి ఆఫీసర్లు ఇద్దరూ. డి. ఐ. జి. ముఖంలో అలసట స్పష్టంగా కనిపిస్తోంది.

"గాయపడిన రెండో ఆర్. పి. యఫ్. కూడా చనిపోయాడు. బాస్టర్డ్స్...వాళ్ళు దొరికితే స్వయంగా ఉరి తీస్తాను" అన్నాడు డి. ఐ. జి. కోపంగా.

"ఇంకా దొరకలేదు వాళ్ళు మనకి? ఇంతకీ మొత్తం ఎంతమందున్నారు?" అడిగాడు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.

"తెలియదు. ఇద్దర్ని మాత్రం స్పష్టంగా చూశారు మావాళ్ళు. ఒకడు గడ్డంవాడు.

ఇద్దరూ కాబిన్లో కనిపించారు. వాళ్ళు కాక వెనక విండోదగ్గర కార్బయిన్తో మరోడున్నాడు. కంపార్టు మెంటులో యెందరున్నారో తెలియదు."

"ఐ సీ. డబ్బు తీసుకొన్నా ఎలా తప్పించుకపోవాలని వాళ్ళ ఆలోచన? వాళ్ళు ప్రయాణీకుల్ని వదలి ట్రైను దిగిన మరుక్షణం వాళ్ళను చంపో, సజీవంగానో బంధిం చడం ఖాయం గదా" అన్నాడు శ్రీనివాస్.

"ఇంత ప్లాన్ వేసినవాళ్ళు డబ్బు తీసుకొన్న తరువాత తప్పించుకోవడానికి ఏదో మార్గం ఆలోచించి వుంటారు. బహుశా ప్రయాణీకుల్లో కొందర్ని తమతో బందీలుగా తీసుకెళతారేమో" దీర్ఘంగా వంతెనవైపు చూస్తూ ఆలో చిస్తూ అన్నాడు గోవింద్.

"ఎంతదూరం అలా వెళ్ళగలరు? వాళ్ళు ఎటు కదిలినా మనకు తెలిసిపోతుంది కదా. బహుశా ఏ హెలీకాప్టర్ నన్నా ఏర్పాటు చేసుకొన్నారేమో!" అన్నాడు శ్రీని వాస్.

శ్రీనివాస్ మాట పూర్తవక ముందే జనంలో యేదో కలకలం వినిపించింది. దాంతోపాటే ఆకాశంలో యేదో చప్పుడు. చటుక్కున తలలు త్రిప్పిచూశారు అందరూ. ఆకాశంలో తూనీగల్లాగ ఎగురుతూ రెండు హెలీకాప్టర్లు వస్తున్నాయి.

"హైదరాబాద్ ఎయిర్ బేస్ నుండి వాటిని ఇక్కడ పెట్రోలింగ్ కు డిస్పాచ్ చేసినట్లు ఇందాకే మెసేజ్

వచ్చింది" అన్నాడు డి. ఐ. జి. వాటివంకే చూస్తూ.

రెండు హెలికాప్టర్లూ ఒకదాని వెనుక ఒకటి యెగురుతూ వెళ్ళాయి బ్రిడ్జిలమీదుగా.

"ఏదో రకంగా వాళ్ళ కంట పడకుండా డీసిల్ కార్ దగ్గరకు చేరగలిగితే!" అంటున్నాడు శ్రీనివాస్ దీర్ఘంగా ఆలోచిస్తూ.

"ఏమిటి ఉపయోగం?" అడిగాడు గోపాల్.

"నాకో ఆలోచన వస్తోంది. వాళ్ళనుగాని మనం పట్టుకోవాలంటే వాళ్ళు ఆ ట్రైనులోనుండి బయటికి వచ్చే సమయానికి ట్రైన్‌లోనే వుండాలి మనం. ఎందుకంటే ట్రైన్‌లోనుండి దిగింతరువాత మనకు దొరికిపోయే విధంగా వాళ్ళు పథకం వేసుకొని వుండరు. ఆ పథకం ఏదయినా మనమెవ్వరం ఊహించలేనిది మాత్రం తప్పని సరిగా అయ్యుంటుంది. మనకందరికీ కనిపించేలా మాత్రం వాళ్ళు ట్రైను దిగరు. అంచేత ఆ సమయానికి మన మెవరమయినా అక్కడ వుండగలిగితే" అన్నాడు శ్రీనివాస్.

"యు ఆర్ క్రేజీ. ఆ వంతెన మధ్యవున్న ట్రెయిన్ దగ్గరికి వాళ్ళ కంట బడకుండా వెళ్ళడం అసంభవం. ఒక వేళ వెళ్ళినా ఒకడు వెళ్ళి చేయగలిగిందేమీ లేదు" అన్నాడు డి. ఐ. జి.

నవ్వాడు శ్రీనివాస్. "మే బి యు ఆర్ రైట్. కాని నా సిక్స్త్ సెన్స్ ఎందుకో ఎవరన్నా ట్రెయిన్ దగ్గరకు చేరుకొని ట్రెయిన్‌తోపాటు వుండడం అవసరం అని హెచ్చరిస్తోంది."

"నీ సిక్స్త్ సెన్స్ గురించి ఓ మనిషి ప్రాణాలు..." అంటున్నాడు డి. ఐ. జి.

"ట్రైను దగ్గరికి వాళ్ళ కంట బడకుండా చేరుకోవడం ప్రాబ్లం కాదనుకొంటాను" అన్నాడు గోపాల్.

"ఎలా?"

నదివైపు చూపించాడు. "వంతెన క్రిందనుండి ఈదుకొంటూ వెళ్ళి స్థంభం ఎక్కి ట్రైనుక్రిందకు చేరుకోవచ్చు" అన్నాడు గోపాల్.

"నో... ట్రైనుకు దగ్గరగావున్న స్థంభం దగ్గరకు ఈదుకొంటూ వెళ్ళగలిగినా స్థంభం యెక్కడంమాత్రం జరిగే పని కాదు. నది మట్టంనుండి దాదాపు ఇరవైఅడుగుల ఎత్తులో వుంది బ్రిడ్జి. ఏ ఆధారం లేకుండా ఆ స్థంభం ఎక్కడం కుదరదు" అన్నాడు డి. ఐ. జి.

"యస్. యూ ఆర్ రైట్. కాని వాళ్ళ కంట బడకుండా ట్రైన్ చేరడానికి మరోమార్గం వుందనుకొంటాను" అన్నాడు గోపాల్.

"ఏమిటది?"

వంతెనవైపు చూపించి, "ఆ వంతెన దూలాలని పట్టుకొని వ్రేలాడుతూ క్రిందనుండి ఆ డీసిల్ కారు దగ్గరికి చేరుకోవచ్చు, వాళ్ళకు కనిపించకుండా" అన్నాడు గోపాల్.

13

టిఫిను, కాఫీలతో మనిషిని పంపిస్తున్నామని మెసేజ్ రాగానే విక్రం కార్బయిన్ తీసుకొని కాబిన్‌లోకి వెళ్ళాడు. పావుగంట తరువాత ఓ మనిషి ఎదురుగా అడుగులు వేస్తూ వంతెనమీదికి రావడం కనిపించింది.

ఎర్రగా, బలంగా వున్నాడతను. ఒంటిమీద చారల డ్రాయరు తప్ప మరేమీ లేదు. ఓ చేతిలో ట్రేలో టిఫిన్ పొట్లాలూ, మరోచేతిలో కాఫీ కెటిలు పట్టుకొని, అతి

జాగ్రత్తగా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ వస్తున్నాడతను. బహుశా ఏ సి. ఐ. డి. ఆఫీసరో అయివుంటాడు అనుకొన్నాడు విక్రం. తమని దగ్గరనుండి చూసే అవకాశాన్ని ఈ సమయంలో ఎవరూ పోగొట్టుకోరు.

మిగిలినవాళ్ళను హెచ్చరించి తనచూపు వంతెనమీద వస్తున్న మనిషిమీదనే నిలిపాడు విక్రం. అతను మెల్లిగా అడుగులు వేసుకొంటూ వచ్చి ట్రైనుకు పదిగజాల దూరంలో ఆగిపోయాడు.

విక్రం అతన్ని ముందుకు రమ్మన్నట్లు సైగ చేశాడు చెయ్యి ఊపుతూ. కార్బయిన్ మాత్రం ఆ వ్యక్తి శరీరం మీదకే గురి పెట్టబడివుంది. కార్బయిన్ ఒకచేత్తో పట్టుకొని రెండవచేత్తో 'విండ్ షీల్డ్' షట్టర్ పూర్తిగా పైకెత్తేశాడు. ఇప్పుడు కాబిన్ లోనుండి బయటకు ఇద్దరు మనుషులు పట్టగలిగిన కంత ఏర్పడింది.

"ఆ ట్రే, కెటిలు, అక్కడ బ్రిడ్జిమధ్య పెట్టి నువ్వు వెనక్కి తిరుగు" అన్నాడు విక్రం.

విక్రం కళ్ళు ఆ మనిషిమీదనుండి ప్రక్కకు తిరగలేదు. అలాగే ఆ మనిషీ విక్రంనే చూస్తున్నాడు. మెల్లిగా వంగి కెటిలు, ట్రే క్రింద పెట్టి వెనక్కి తిరిగాడు.

"ఇప్పుడు మెల్లిగా ఒక్కొక్క అడుగే వేస్తూ ముందుకు కదులు" అన్నాడు.

అతను ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ అతి మెల్లగా కదలసాగాడు. జానీకి సైగ చెయ్యగానే, జానీ విండ్ షీల్డ్ వుండే ప్రాంతంనుండి క్రిందకు దిగి చకచకా కెటిలు, ట్రే లోపలకు తెచ్చాడు నిముషంలో. ఆ వ్యక్తి ఇంకా వంతెన చివరకు చేరుకోనేలేదు.

జానీ లోపలకు రాగానే షట్టర్ క్రిందికి దించేశాడు విక్రం.

"గుడ్. పాసింజర్లందరికీ తలో ఓ పాకెట్టు అందించు" అన్నాడు విక్రం జానీతోపాటు కంపార్టుమెంటులోకి వస్తూ.

జానీ చకచకా అందరిమీదకూ తలకొక పాకెట్ విసిరేశాడు. తాము తెగించిన పనులు ఏమీ చెయ్యకపోతే, దుండగులు తమకు ఏమీ హాని చెయ్యరనే విషయం అర్థమయిన పాసింజర్లు చకచకా టిఫిన్ పొట్లాలు విప్పుకొని ఇడ్లీలు తినసాగారు.

పరిమళ మాత్రం "నాకు లంచ్ బాక్స్‌లో మీల్స్ వున్నాయి. నాకు అక్కరలేదు" అంది తన పాకెట్‌ను ప్రక్కనున్న గురుమూర్తికి ఇచ్చేస్తూ.

పది నిముషాల్లో అందరూ టిఫిన్ చేశారు.

"విక్రం మనం కూడా..." అంటున్నాడు జానీ.

విక్రం మాట్లాడలేదు. చిత్రంగా పాసింజర్ల వైపు చూస్తున్నాడు. అందరూ, చూస్తుండగానే, టిఫిన్‌లు తిన్న అందరూ కళ్లు తేలవేయసాగారు. మరో రెండు నిముషాల్లో అందరికీ స్పృహపోయింది పరిమళకు తప్ప.

వరుసలో, మొదటి సీట్లో కూర్చున్న సాంబశివరావును అటూ ఇటూ కదిపాడు విక్రం. ప్రక్క సీట్లో విల్సన్ మీద చలనరహితంగా వాలిపోయాడతను. పరిమళ స్పృహవున్నా చుట్టూ జరుగుతున్నది చూసి బొమ్మలా వుండిపోయింది.

"క్లెవర్ బాస్టర్డ్! మనం టిఫిన్ తిని వుంటే మనకీ ఆ గతి పట్టివుండేది" అన్నాడు విక్రం గబగబ ఓ టిఫిన్ పాకెట్ విప్పి వాసన చూస్తూ.

"విషమా?" అడిగాడు గనీ.

"నో... బాగా ఘాటైన మత్తుమందు అయ్యుండాలి. వాసన తెలియడంలేదు" అన్నాడు విక్రం పాకెట్ను కిటికీలోనుండి బయటికి విసిరేస్తూ.

బొమ్మలా కూర్చొన్న పరిమళ వున్నట్లుండి వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. కన్నీళ్ళు రావడంలేదు. కానీ విపరీతమైన ఎక్కిళ్ళు. గుర్తు తెలియని జంతువు అరవులా ఒళ్ళు గగుర్పొడిచే స్వరంతో ఏడుపు.

"స్టాపిట్! యు బిచ్" అరిచాడు గనీ పళ్ళ బిగువున. పరిమళకు ఆ అరుపు వినబడినట్లు లేదు. బొమ్మలా అలాగే కూర్చొనివుంది. వెక్కిళ్ళు, ఏడుపు ఆగడంలేదు.

"బహుశా షాక్ అయివుండాలి" అన్నాడు విక్రం ఆమె దగ్గరికి వెళుతూ.

పరిమళలో ఏం మార్పులేదు. ముందుకు వంగి ఆమె రెండు చెంపలమీదా 'చెళ్ళు' మనేలా కొట్టాడు విక్రం. పరిమళ చెంపలు ఎర్రబడి బూరెల్లా పొంగాయి. వెక్కిళ్లూ, ఏడుపూ ఆగి, కళ్ళలోకి తెలివి వచ్చింది. కళ్ళు జలపాతాల్లా నీళ్ళు కార్చడం మొదలుపెట్టాయి.

"టేకిట్ యీజీ మిస్! వాళ్ళు చావలేదు. స్పృహ తప్పారు. అంతే! టేకిటీజ్" అన్నాడు అనునయంగా.

పరిమళ రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని యేడుస్తోంది. చటుక్కున ఏదో గుర్తొచ్చినట్లు వెనక్కి తిరిగాడు విక్రం. ట్రాన్స్రిసీవర్ దగ్గరికి వెళ్ళి స్విచ్ ఆన్ చేశాడు.

"ఆపరేషన్ మిలియన్ కాలింగ్" అన్నాడు.

వెంటనే అవతలివైపునుండి సమాధానం వినిపించింది.

'డి. యస్. రాజంను రమ్మను" అన్నాడు.

రెండునిముషాల్లో డి. యమ్. రాజం కంఠం వినిపించింది "యస్. మిస్టర్."

"థాంక్యూ మిస్టర్ రాజం! మీరు చేసిన సహాయానికి కృతజ్ఞతలు" విక్రం కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది.

"ఓ...." అన్నాడు రాజం, ఏం జవాబు చెప్పాలో తోచక.

గట్టిగా నవ్వాడు విక్రం. "అవును! మీరు మత్తుమందు కలిపిన టిఫిన్ తిని పాసింజర్లందరూ హాయిగా గాఢ సుషుప్తిలో వున్నారు. ఓపిగ్గా నిలబడి వాళ్ళకు కాపలా కాసే బాధ్యత తగ్గించినందుకు నీకు మా కృతజ్ఞతలు."

"నీ వంటున్నదేమిటో నా కర్థం కావడంలేదు మిస్టర్" అన్నాడు రాజం కంగారుగా.

విక్రం కంఠం పిడుగులా తయారయింది. "స్టాప్ ది నాన్సెన్స్ మిస్టర్ రాజం! ప్రయాణీకులతోపాటు మేం కూడా ఆ టిఫిన్ తింటామని ఊహించి అందులో మత్తుమందు కలిపారు మీరు. కాని అలా జరగలేదు. బహుశా మేం మత్తులో పడగానే డీసిల్ కారును స్వాధీనం చేసుకోవడానికి మీ రైల్వే రక్షక సిబ్బంది ఆయత్తమవుతూ వుంటారనుకొంటాను. వాళ్ళను ఆ ప్రయత్నంలోనుండి విరమించుకోమని తెలియచేయి."

"అయామ్ సారీ...మిస్టర్" రాజం కంఠం అపాలజటిక్ గా వుంది.

"నెవర్ మైండ్ మిస్టర్ రాజం! మూడుగంటలకల్లా మాకు కాష్ అందకపోతే యు విల్ బి రియల్లీ సారీ. మీరు చేసిన పనివల్ల ఇద్దరు పాసింజర్లు నెప్పి తెలియకుండా పరలోకం చేరుకొంటారు" అన్నాడు ట్రాన్సురిసీవర్ స్విచ్ ఆపేస్తూ.

కంపార్టుమెంట్‌లోని నలుగురి ముఖాల్లోనూ చిరునవ్వులు వెలిశాయి. అందరూ సిగరెట్లు వెలిగించారు. పరిమళ ఏడుపు మాని పిచ్చిచూపులు చూస్తూ కూర్చొంది. మూడుగంటలు ఎప్పుడవుతుందా అని యెదురు చూడ్డం మొదలుపెట్టారు.

14

గనీ బాక్సులోనుండి నైలాన్ రోప్ తీసి, జానీకి ఓ ఉండ విసిరేసి తనో ఉండ తీసుకొన్నాడు. సీట్లమీద జారగిలబడి ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న వాళ్ళందరినీ వరసగా తాడుతో చేతులు కట్టేశారు ఇద్దరు. విడి త్రాడుతో మాధవన్ కాళ్ళూ చేతులూ కలిపి కట్టేశారు.

తాడుతో చేతులు రెండూ బిగించి కడుతున్నప్పుడు కూడా పరిమళ ఏమీ మాట్లాడలేదు. కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది. కన్నీళ్ళు కారి, ఆరిపోయి చారలుకట్టే వున్నది ఆమె ముఖమంతా.

"డోన్ట్ వర్రీ మిస్! నీకేం భయంలేదు," అన్నాడు జానీ జాలిగా.

గనీ నవ్వుతూ ఆమెవైపు చూశాడు. "యు ఆర్ ప్రెటీ! నీ పేరేమిటి?" అన్నాడు.

పరిమళ మాట్లాడలేదు. భారంగా కళ్ళు మూసుకొంది. తన జీవితంలో ఈరోజు ఓ పీడకలలా మిగిలిపోతుంది. అసలీ భయంకరమైన సంఘటననుండి తను బయటపడగలదా అనే సంశయం ఆమె భయాన్ని మరింత పెంచుతోంది.

గనీ ఆమెకు దగ్గరగా వచ్చాడు. భుజంమీద చెయ్యివేసి బలంగా కుదిపాడు. పరిమళ ఆకులా వణికిపోయింది.

"మాట్లాడవేం?" గర్జించాడు గనీ.

"ప్లీజ్ ...నన్నేం చెయ్యక!" ఆమె మాటలు నూతిలో నుండి వచ్చినట్లున్నాయ్.

పెద్దగా నవ్వాడు గనీ. "భయపడక! పేరడిగితే కళ్ళు మూసుకొంటే మాటలు రావేమో అనుకొన్నాను" అన్నాడు వెకిలిగా.

పరిమళ అతన్ని బెదురుతో చూస్తోంది. నలుగురు దుండగులు, పదిమంది చలనరహితులు, మధ్య తనొక్కతి. వాళ్ళేమయినా అఘాయిత్యం తలపెడితే? పైగా చేతులు కూడా కట్టేసివున్నాయి. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

గనీ చూపుల్లో పిచ్చితనం కనిపిస్తోంది. వంటరి ఆడ దానిలోని నిస్సహాయత అతణ్ణి రెచ్చగొడుతోంది. నవ్వుతూ ఆమె భుజంమీద చెయ్యివేశాడు.

పరిమళకు ఒళ్ళు జలదరించింది. అతని చేతివేళ్ళు ఒంటి మీద కదుల్తోంటే బల్లులులా అనిపించాయి. గనీ చెయ్యి ఆమె భుజంమీదనుండి క్రిందకు జారింది. గుండ్రని ఆమె రొమ్ము అతని చేతికి బలంగా, మృదువుగా తగుల్తోంది.

పరిమళ ఇక వుండబట్టలేకపోయింది. ఇంతవరకూ జరిగింది ఒకటి, ఇప్పుడు జరగబోతున్నది మరొకటి. రెండు కాళ్ళూ ఒకేసారి పైకి ఎత్తి గనీ మోకాళ్ళమీద పిచ్చిగా తన్నింది.

గనీ ఊహించని ఆ దెబ్బకు, ముందు సీట్లలో నిద్ర పోతున్నవారిమీద పడి క్రిందికి దొర్లి సీట్లమధ్య సందులో పడిపోయాడు.

జరుగుతోన్న డ్రామాను ఆసక్తితో చూస్తోన్న జానీ, రాజా లిద్దరూ విరగబడి నవ్వారు. క్రిందపడిన గనీ క్షణంలో తేరుకొని లేచి నిలబడ్డాడు.

"యూ డర్టీ బిచ్ ..." అంటూ పరిమళ జాకెట్టు ప్రదర్శన చించేశాడు.

విక్రం తన దగ్గరకు ఎప్పుడు వచ్చాడో గనీ గమనించ లేదు. భుజంమీద పడిన చెయ్యిని విదిలించుకోబోయేడు. కాని విక్రం పిడికిలి అతని భుజాన్ని వదల్లేదు.

విక్రం అతన్ని బలంగా వెనక్కి తనవైపుకు త్రిప్పి కుడిచేత్తో పిడికిలి బిగించి గడ్డంమీద బలంగా గుద్దాడు.

గనీ బుర్రలో నక్షత్రాలు మెరిశాయి. తనకు తెలియ కుండానే మోకాళ్ళు తోటకూర కాడల్లా వంగి కుప్పలా కూలిపోయాడు.

"బండిలో ఆడవాళ్ళ జోలికి వెళ్ళవద్దని చెప్పిన ఆజ్ఞ పాటించనందుకు అది" అన్నాడు విక్రం రెండు నిముషాల తరువాత లేచి కూని నిలబడిన గనీని చూసి.

"ఓ. ది హెల్ విత్ యువర్ ఆర్డర్! కుర్రాళ్ళకు అప్పుడప్పుడూ ఆ మాత్రం జల్సా లేకపోతే ఎలా?" అన్నాడు గనీ నవ్వుతూ.

"షటప్! అండ్ లీవ్ హార్ ఎలోన్" అన్నాడు విక్రం కాబిన్ లోకి నడుస్తూ.

15

మూడయింది.

విక్రం ట్రాన్స్ రిసీవరు స్విచ్ ఆన్ చేసి, స్పీకర్ వాల్యూం పెంచాడు.

"ఆపరేషన్ మిలియన్ కాలింగ్ ..."

"ఆపరేషన్ మిలియన్ రిసీవింగ్ ..." అవతల ఆప రేటర్ గొంతు వినిపించింది.

మరుక్షణం. డి. యమ్. రాజం గొంతు వినిపించింది.

"యువర్ మనీ యీజ్ రడీ మిష్టర్!"

"అన్నీ పాత నోట్లే కదా?" అడిగాడు విక్రం.

"యస్...యస్...అన్నీ పాతవి. చిన్న డినామినేషన్వి."

"సీరియల్ నంబర్స్ లేవు కదా?"

"లేవు!"

"గుడ్! ఇప్పుడు డబ్బు ఎలా అందజేయాలో చెపుతాను. స్పష్టంగా విను."

"ప్లీజ్! కారీఆన్!" రాజం కంఠంలో టెన్షన్ కనిపిస్తోంది.

"ఆ డబ్బును నాలుగు సూట్ కేస్లలో సమాన మొత్తాలుగా సర్దండి. తర్వాత ఆ నాలుగు సూట్ కేస్లను ఒక మోటార్ ట్రాలీమీద పెట్టించి ఒక మనిషి ద్వారా ట్రెన్ దగ్గరకు పంపండి. సూట్ కేసుల్లో డబ్బు కాకుండా మరేదన్నా పెట్టి పంపించి మోసం చెయ్యాలని ప్రయత్నించారా...అవి తెచ్చిన మనిషిని అక్కడికక్కడే కుక్కల్ని కాల్చినట్లు కాల్చి చంపుతాను. అర్థమయిందా?"

"యస్...యస్...అర్థమయింది"అన్నాడు రాజం.

"రిపీట్!"

విక్రం చెప్పిన ఇన్స్ట్రక్షన్స్ అన్నీ రిపీట్ చేశాడు రాజం.

"గుడ్! వెంటనే క్యాష్ పంపించు" అన్నాడు విక్రం స్విచ్ ఆఫ్ చేస్తూ.

మరో గంటలో వంతెనమీదకు మోటార్ ట్రాలీ రావడం కనిపించింది. రాజాను వెనకవైపు జాగ్రత్తగా కాపలా కాస్తూండమని, గనీకి ప్రయాణీకులను కనిపెట్టుకొని వుండమని చెప్పి జానీని తీసుకొని ఫ్రంట్ కాబిన్ లోకి వెళ్ళి విండ్ షీల్డ్ అద్దం ఎత్తేసి తయారుగావున్నాడు విక్రమ్.

మోటారు ట్రాలీ మెల్లిగా ముందుకు కదుల్తూ వస్తోంది. ట్రాలీమీద ఓ మనిషి, అతని ప్రక్కనే వరసగా పేర్చి వున్న నాలుగు సూట్ కేసులు కనిపిస్తోన్నాయి.

ట్రైన్ లో వున్న నలుగురిలో ఉత్సుకత ఉరకలు వేస్తోంది.

ట్రాలీ డీసిల్ కారుకు అయిదు గజాల దూరంలోకి వచ్చి ఆగిపోయింది. విక్రం చేతిలో కార్బయిన్ ట్రాలీ డ్రైవర్ మీదకే గురిపెట్టబడి వుంది. ఉత్సుకతలో మైక్ ఉపయోగించలేదు విక్రం.

"ట్రాలీని డీసెల్ కారుకు దగ్గరగా తీసుకురా!" అరిచాడు గట్టిగా.

ట్రాలీ మెల్లిగా ముందుకు కలిదింది. డీసిల్ కారుకు అరడుగు దూరంలోకి వచ్చి ఆగిపోయింది. జానీకి సైగ చెయ్యగానే, విండ్ షీల్డ్ లోనుండి క్రిందకు దిగాడు జానీ. ఒక్కొక్క సూట్ కేసే వరుసగా కేబిన్ లోకి అందించాడు. సూట్ కేసులు తీసుకొంటున్నంతసేపూ విక్రం కార్బయిన్ ట్రాలీమీద వ్యక్తికే గురిపెట్టబడింది.

జానీ లోపలకు రాగానే కార్బయిన్ జానీ చేతికిచ్చి, "చెక్ చేసేవరకూ వాణ్ణి వెళ్ళనియ్యకు" అన్నాడు.

నాలుగు సూట్ కేస్ లనూ కాబిన్ నుండి ఎడంగా లాగి మూతలు తెరిచాడు విక్రం. అన్నిటినిండా పదులూ, అయిదులు, రెండ్లు, ఒకట్లు కట్టలుగా కట్టే వున్నాయి. అన్నీ పాత నోట్లు. ఇక సూట్ కేసు అడుగుకు చెయ్యి పోనిచ్చి ఓ అయిదుల కట్ట బయటికి లాగాడు. నెంబర్లు చెక్ చేశాడు. అన్నీ విడి నంబర్లు. సూట్ కేసులు మూత వేసి కాబిన్ లోకి వచ్చాడు.

ఆర్మీ హెలీకాప్టర్లు రెండూ రయ్యిన ఎగురుతూ వెళ్ళి నయి. తాము తప్పించుకోవడానికి ఈ హెలీకాప్టర్లు ఓ తలనొప్పి అనుకొన్నాడు మనసులో.

"ఓ. కె. వెనక్కి వెళ్ళిపో! సరిగ్గా ఆరు గంటలకి మమ్మల్ని కాంటాక్టు చెయ్యమని చెప్పు డి. యమ్.కు" అన్నాడు.

నాలుగున్నరయింది అప్పుడు.

అదే సమయంలో—

బ్రిడ్జికి వ్రేలాడుతూ అతి కష్టంమీద డీసిల్ కారు క్రిందకి చేరుకొన్నాడు గోపాల్.

కాసేపు విశ్రాంతి తీసుకున్నాక మెల్లిగా స్లీపర్ల మధ్య నుండి పైకి ఎగబ్రాకి పట్టాలమధ్యకు వచ్చాడు. డీసిల్ కారు అడుగు భాగం దుమ్ముకొట్టుకొని, ఆయిల్ మరక లతో అసహ్యంగా కనిపిస్తోంది. ఈ క్షణంలో బండి కది లితే తన జీవితం ఇంతటితో ఆఖరు. బండి కదిలినా ప్రమాదం లేకుండా బండికి వ్రేలాడ్డానికి అనువైన ప్రదేశం ఏముందా అని చుట్టూ చూశాడు.

కంపార్టుమెంటు స్ట్రిక్చర్ సపోర్టుచేస్తూ వున్న రెండు దూలాలకు మధ్య బలంగా వుండడానికి వేసిన యినుప రాడ్‌లు కనిపించాయి. అడుగుకు ఓ రాడ్ చొప్పున వున్నది. ఓ రాడ్‌లో చేతులు దూర్చి, అక్కడినుండి నాలుగో రాడ్ మీద కాళ్ళు ఆనించి వ్రేలాడవచ్చు. కాని బండి కదిలితే ఆ వేగానికి తన పట్టు యెంతవరకు ఆగు తుందో చెప్పడం కష్టం. అంతేకాక బండి కదుల్తోన్న ప్పుడు అక్కడనుండి కంపార్టుమెంటులోకి యెక్కడం అసంభవం.

మెల్లిగా పాకొంటూ కంపార్టుమెంటు చివరికి వెళ్ళాడు. సరిగ్గా కంపార్టుమెంటు డోర్‌లు వుండే ప్రదేశానికి క్రింద రెండు రెండు చక్రాలు వున్నాయి. చక్రాల బయటికి డోర్ నుండి క్రిందకు దిగడానికి వున్న ఇనుప మెట్లు కనిపిస్తోన్నయ్. అదే తనకు కావలసిన ప్రదేశం అనుకొన్నాడు.

మెల్లిగా, నిశ్శబ్దంగా చక్రాల మధ్యనుండి పాకొంటూ పట్టా అవతలికి వెళ్ళాడు. ఇక్కడినుండి చెయ్యి బయటికి చాస్తే కంపార్టుమెంటునుండి బయటికి చూసేవాళ్ళకి కనిపిస్తుంది.

మెల్లిగా రెండు చక్రాలకూ జాయింట్‌లా వున్న స్ప్రింగ్ మీద సీట్ ఆనించి, రెండుకాళ్ళూ డోర్ దగ్గర చివరి మెట్లమీద పెట్టి, మరో మెట్టును ముందుకు వంగి గట్టిగా పట్టుకొన్నాడు.

ఈ పొజిషన్‌లో బండి కదిలినా పడిపోకుండా వుండొచ్చు. కాని ఎక్కువసేపు ఆ పొజిషన్‌లో వుంటే, నడుం వంగి విపరీతమైన నొప్పి పుడుతుంది. అయినా అలాగే కూర్చొన్నాడు గోపాల్.

మోటార్ ట్రాలీ రావడం, సూట్‌కేసులు అందించడం, పెట్టెలో వాళ్ళు నలుగురూ అటూ ఇటూ తిరుగుతున్న చప్పుడూ, అన్నీ వినిపిస్తున్నయ్. ఇంకా యెంత సేపో! అనుకొన్నాడు యెదురుగా కనిపిస్తోన్న మరో రైలుబ్రిడ్జి చూస్తూ.

16

సాయంత్రం ఆరయింది.

వర్షాకాలం కావడంవల్ల ఆకాశమంతా మబ్బుపట్టి అయిదింటినుండీ చీకటి పడడం ప్రారంభించింది. అరయే

ప్పటికి పూర్తిగా చీకటి పడింది. దూరంగా కృష్ణా బారేజ్ మీదా, ఆక్వెడక్టుమీదా, కనకదుర్గ ఆలయం లోనూ, ఘాట్ రోడ్ మీదా ఫ్లోరెసెంట్ లైట్లు దేదీప్య మానంగా వెలగడం మొదలెట్టాయి.

డబ్బు ముట్టినా, ఇంకా బ్రిడ్జిమీదనుండి కదలని డీసిల్ కారును చూసి రైల్వే అధికారుల్లోనూ, పోలీసు ల్లోనూ ఆందోళన మొదలయింది. దుండగులు ఏ రకంగా తప్పించుకోవాలనుకొంటున్నారో ఎవరికీ అంతు బట్టడం లేదు. బ్రిడ్జికి రెండువైపులా ఆక్మీదళాలు గస్తీ తిరుగు తున్నాయి.

సరిగ్గా ఆరుగంటలకు విక్రంనుండి సంకేతం రావడంతో వైరెలెస్ రూములో సమావేశమైన అధికారులకు ప్రాణం లేచివచ్చినట్లయింది.

"డి. యమ్. రాజం హియర్!" అన్నాడు రాజం.

"గుడ్ మిస్టర్ రాజం! ఇప్పుడు నేను చెప్పబోయే ప్రతీ అక్షరం జాగ్రత్తగా విను. అవసరమైతే పెన్, పాడ్ దగ్గర పెట్టుకొని వ్రాసుకో. ఏమాత్రం పొరపాటు జరిగినా పదిమంది ప్రయాణీకుల ప్రాణాలు పోతాయని గుర్తుంచుకో!" వైర్ లెస్ ట్రాన్స్ రిసీవర్ లో విక్రం కంఠం కఠినంగా ధ్వనించింది.

గదిలో ఒక్కసారి టెన్షన్ పెరిగింది. అందరూ చెవులు రిక్కించుకొని విక్రం చెప్పేమాటలు వినసాగారు.

"సరిగ్గా మరో అరగంటలో మేము బయలుదేర బోతున్నాం. ఎటు వెళ్ళబోతున్నాము అనేది నీ కనవ సరం. అంచేత క్రిష్ణాబ్రిడ్జి దగ్గరనుండి తెనాలిమీదుగా మద్రాస్ వరకూ, గుంటూరుమీదుగా మద్రాస్ వరకూ, మా ముందువైపు హైదరాబాద్ వరకూ రైల్ ట్రాక్ పూర్తిగా

లైన్ క్లియర్ చేసి ఇవ్వాలి. అండర్‌స్టాండ్!'' విక్రం ఆగాడు.

రాజం ముఖంమీద ముచ్చెమటలు పోసాయి. ''మిస్టర్! దటీజ్ ఇంపాసిబుల్! బ్రిడ్జిమీద మీ డీసిల్ కారు ఆగిపోవడంవలన దక్షిణ మధ్య రైల్వే మెయిన్ లైన్ ట్రాఫిక్ అంతా ఉదయంనుండి ఎక్కడికక్కడ ఆగిపోయివుంది. కొన్ని బళ్ళు మెయిన్ లైన్స్‌మీద అలాగే వున్నాయి. వాటన్నిటినీ లూప్ లైన్స్‌లోకి సర్ది మీకు లైన్ క్లియర్ ఇవ్వడం అరగంటలో అయ్యేపని కాదు'' రాజం గొంతు హిస్టీరియా వచ్చినవాడికిమల్లే వుంది.

పగలబడి నవ్వాడు విక్రం. ''మిస్టర్ రాజం! నిన్ను చూస్తే జాలేస్తోంది. కానీ నువ్వీ పని చెయ్యకతప్పదు. పోనీ మరో అరగంట టైమిస్తాను. అంటే ఏడుగంటల వరకూ. ఏడుగంటలకల్లా డీసిల్ కారు బ్రిడ్జిమీదనుండి కదలాలి. ఈలోగా నేను చెప్పిన మార్గాలన్నీ లైన్ క్లియర్ చేసివుంచు.''

రాజం తనప్రక్కనే వున్న ఛీఫ్ ట్రాఫిక్ కంట్రోలర్ వైపు తిరిగి తల ఊపాడు. వెంటనే ఛీఫ్ ట్రాఫిక్ కంట్రోలరు అన్ని స్టేషన్లకూ 'వే క్లియరెన్స్' చెయ్యమని చెప్పడానికి బయటికి పరిగెత్తాడు.

''దెన్ ది సెకండ్ పాయింట్. వింటున్నావా మిస్టర్ రాజం?'' విక్రం ప్రశ్న.

''వింటున్నాను.''

''ట్రాక్ పొడవున ఎక్కడా పోలీసుగానీ, ఆర్మీగాని వుండకూడదు. మమ్మల్ని వెంబడించకూడదు. అలాగానీ డీసిల్ కారును ఎవరయినా వెంబడిస్తున్నట్లు గాని మాకు

అనుమానం కలిగితే, ఓ పాసింజరు ప్రాణం పోయినట్లే లెక్క వేసుకోండి."

'బాస్టర్డ్!' అనుకొన్నాడు రాజం మనసులోనే.

"పాయింట్ నెంబర్ త్రీ! ఆ ఆర్మీ హెలికాప్టరను వెంటనే గ్రౌండ్ చెయ్యాలి. అది ఏమాత్రం మమ్మల్ని ట్రాక్ చెయ్యాలని మా వెనకే వచ్చినా, పాసింజెర్లు భూమ్మీద వుండరని గుర్తుంచుకోండి. వింటున్నావా?"

"యస్. యస్. అర్థమయింది."

"అండ్ దెన్ ది ఫోర్త్ పాయింట్. వెరీ ఇంపార్టెంట్. ఇరవైమందిని తీసుకెళ్ళగల విమానాలు రెండిటిని మద్రాసు ఎయిర్‌పోర్టులోను, బేగంపేట విమానాశ్రయంలోనూ, పైలట్‌తోసహా సిద్ధంగా వుంచమని వెంటనే మెసేజ్ పంపండి. మద్రాస్‌గాని, హైదరాబాద్‌గాని చేరుకొన్నాక వాళ్ళేం చెయ్యాలో అక్కడి అధికారులకు సేమ్ వేవ్ లెంత్ మీద మెసేజ్ పంపుతాను. ఓ. కె."

"ఓ. కె. ఐ అండర్‌స్టాండ్!" రాజం గొంతులో వణుకు స్పష్టంగా తెలుస్తోంది.

"ప్లీజ్ రిపీట్ మై ఇన్‌స్ట్రక్షన్స్!" విక్రం గొంతులో పరిహాసం.

విక్రం చెప్పిన విషయాలు ఒకొక్కటీ అప్పజెప్పాడు రాజం.

"గుడ్! గెట్ క్రాకింగ్. ఏడుగంటలకల్లా అంతా సిద్ధం కావాలి."

ట్రాన్స్ రిసీవర్‌లో మెసేజ్ ఆగిపోయింది.

* * *

జాగ్రత్తగా తను కూర్చొన్న పొజిషన్‌నుండి క్రిందకు దిగి బెల్టులోనుండి మినీ వైర్‌లెస్ సెట్టు బయటికి తీశాడు

గోపాల్. వంతెన అంతా చీకటిగా వుంది. డీసెల్ కార్లో కూడా షట్టర్సు దించివేయడంవలన లోపలి వెలుతురు బయటికి కనిపించడంలేదు.

స్విచ్ ఆన్ చేయగానే అవతలివైపునుండి శ్రీనివాస్ కంఠం ఆత్రంగా వినిపించింది. "గోపాల్! ఆర్ యు ఆల్ రైట్?"

"ఓ. కె. అయామ్ ఆల్ రైట్. ఏం జరుగుతోంది?" స్వరం తగ్గించి మెల్లిగా అడిగాడు.

"మరో అరగంలో...అంటే ఏడుగంటలకు వాళ్ళు బయలుదేరబోతున్నారు. మద్రాసుగాని, హైదరాబాదు గాని వెళతామంటున్నారు. కాని వాళ్ళు మధ్యలో ఎక్కడో దిగేస్తారని నా నమ్మకం. సో బి ప్రిపేర్డ్. జాగ్రత్తగా వుండు. ట్రెన్ మోషన్‌లో వున్నప్పుడు చాలా డేంజర్. గుడ్ లక్" అన్నాడు శ్రీనివాస్.

"థాంక్స్!" అని స్విచ్ ఆఫ్ చేసి మళ్ళీ తన పొజిషన్‌లోకి మారాడు గోపాల్.

17

హైదరాబాద్‌కి, మద్రాసుకు రెండువైపులా ట్రాక్ క్లియర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ప్రయాణికులు ఇంకా ఎవరూ మత్తునుండి తేరుకోలేదు. బహుశా ఏ యల్. యస్. డి. లాంటి ఘాటైన మందయి వుంటుంది. పరిమళమాత్రం చిరిగిన జాకెట్‌తో అలాగే సీట్‌మీదకు వాలి నిద్రపోతోంది.

విక్రం తన అనుచరులకు చకచకా ఆర్డర్లు యిచ్చాడు. ప్రయాణికులకు కట్టిన తాళ్ళన్నీ గట్టిగా వున్నదీ లేనిదీ ఓసారి సరిచూసుకొన్నారు. విక్రం ఆజ్ఞప్రకారం కంపార్టుమెంట్లో లైట్లు ఆర్పేశారు. కంపార్టుమెంట్ లోపల

చిమ్మచీకటిగా వుంది. నాలుగు సూట్ కేసుల్నీ బ్యారేజ్ వైపు వుండే ఫ్రంట్ డోర్ వద్దకు తెచ్చిపెట్టారు.

విక్రంకూడా కాబిన్‌లో లైటు ఆర్పేశాడు. "జానీ నువ్వు కుడివైపు వున్న కిటికీలదగ్గర నిలబడు. గనీ నీవు ఎడమవైపు, రాజా నీవు నీ మామూలు పొజిషన్‌లో వుండు. ఎవరయినా ట్రాక్ ప్రక్కన మనల్ని వెండిస్తున్నారేమో జాగ్రత్తగా గమనించండి. వాచవుట్ ఫర్ ది హెలీకాప్టర్స్! ఏమాత్రం అనుమానం తగిలినా వెంటనే నాకు చెప్పండి. చివరి నిముషంలో మన ప్లాను మరింత జాగ్రత్తగా వుండాలి!" అన్నాడు విక్రం చివర ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తూ.

అందరూ ఎవరి పొజిషన్‌లో వాళ్ళు నిలబడ్డారు. అందరి మనసుల్లో ఆనందం గంతులు వేస్తోంది. ఇంత వరకూ విజయవంతంగా నడిపిన పథకాన్ని అజాగ్రత్తగా చెడగొట్టి దొరికిపోవడం ఎవరికీ ఇష్టంలేదు.

విక్రం మెల్లిగా ఇంజన్ స్విచ్ ఆన్ చేసి, బ్రేక్ రిలీజ్ చేశాడు. డీసిల్ కారు చిన్నగా చప్పుడు చేసుకొంటూ ముందుకు కదిలింది. రెండుసార్లు గట్టిగా సైరన్ యిచ్చి ముందుకు కదలనిచ్చాడు. విజయవాడవైపు వంతెన చివర వరకూ పోనిచ్చి, బ్రేక్ వేసి, రివర్స్ చేశాడు. ఫ్యూయల్ సప్లయ్ లివర్‌ను క్రిందకు లాగి వేగం పెంచాడు.

వెంటనే డీసిల్ కారు వెనక్కి, మద్రాసువైపు వేగంగా ప్రయాణం చేయడం మొదలుపెట్టింది. చకచక డీసిల్ కారు కదుల్తోంటే చల్లటిగాలి కంపార్టుమెంట్‌లోకి దూసుకువస్తోంది. నలుగురి కళ్ళు ట్రాక్ చుట్టుప్రక్కల గాలిస్తున్నాయి.

మూడునిముషాల్లో కారు కృష్ణా కెనాల్ జంక్షన్‌లోకి వచ్చింది. బండిని మెల్లిగా స్లో చేశాడు విక్రం. ప్లాట్‌ఫారంమీదగాని, చుట్టుప్రక్కలకికూడా మానవసంచలనం లేకపోవడం చూసి నవ్వుకొన్నాడు. కాబిన్‌లోనుండి తల పెట్టి బయటకు చూశాడు. ఎడమకు ఒకటి, కుడికి ఒకటి పచ్చసిగ్నల్ లైట్లు వెలుగుతూ కనిపించాయి.

ఎడమవైపు ట్రాక్ తెనాలిమీదుగా మద్రాసు పోతుంది. కుడివైపు ట్రాక్ గుంటూరుమీదుగా తెనాలి, అక్కడ నుండి మద్రాసు పోతుంది. జాగ్రత్తగా డీసిల్‌కార్‌ను కుడివైపు ట్రాక్‌మీదకు మళ్ళించాడు. స్పీడు పెంచాడు. అంటే ఇప్పుడు కారు గుంటూరు లైన్‌మీద పోతుందన్న మాట.

తల త్రిప్పి దూరంగా కుడివైపు కనిపించే కలకత్తా-మద్రాసు ట్రంక్‌రోడ్ వైపు చూశాడు. కార్లు, ఇతర మోటారువాహనాలు వేగంగా అటూ ఇటూ వెళ్ళడం వాటి లైట్లనుబట్టి తెలుస్తుంది. అందులో కొన్ని ఆర్మీకి, పోలీసుకు చెందిన వాహనాలున్నా ఆశ్చర్యంలేదు అనుకొన్నాడు. ఆ రోడ్డు అలా ప్రక్కకు వంపు తిరుగుతూ, మంగళగిరి దగ్గర ఈ రైల్వేలైనును క్రాస్ చేస్తుంది.

కృష్ణా సిమెంట్ స్టేషన్ దాటింది డీసిల్ కారు. ప్రక్కనే కె. సి. పి. సిమెంట్ ఫ్యాక్టరీ పొగలుకక్కుతూ పనిచేస్తోంది. విక్రంలో టెన్షన్ పెరిగింది. మెల్లిగా స్పీడు కొద్దికొద్దిగా తగ్గించడం ప్రారంభించాడు. ఇక్కడనుండి మంగళగిరి మూడు మైళ్ళలో వుంటుంది.

“ఎవిరిథింగ్ ఓ. కే?” అరిచాడు విక్రం.

“ఓ. కె.” కంపార్టుమెంట్‌లోనుండి జవాబిచ్చాడు జానీ.

"రైట్! బి రడీ!" అన్నాడు విక్రం స్పీడు మరింత తగ్గిస్తూ.

కృష్ణా సిమెంట్ హాల్ట్ స్టేషన్ తరువాత, ఓ అర మైలుకు రైలుమార్గం రెండు చిన్న కొండల మధ్యనుండి పోతుంది. అవి నిజానికి రెండు కొండలు కావు. ఒక కొండవాలులో రాతిని పగలగొట్టి రైలుమార్గం వేశారు. ఓ ఫర్లాంగుదూరం రైలు ఈ మార్గంలో పోతున్నప్పుడు బయటనుండి చూసేవాళ్ళకి కనిపించదు.

సరిగ్గా ఆ మార్గంలోకి రాగానే బ్రేక్ వేశాడు విక్రం. జానీ, రాజా, గనీ, ముగ్గురూ కుడివైపు డోర్ తెరుచుకొని నాలుగు సూట్‌కేస్‌లను తీసుకొని చకచక క్రిందికి దిగిపోయారు. అంతా అర నిముషం పట్టలేదు. విక్రం మాత్రం కాబిన్‌లో వున్నాడు.

వెంటనే విక్రం, బ్రేక్‌ను అలానే నొక్కిపట్టి వుంచి ఫ్యూయిల్ సప్లయ్ లివర్‌ను మరింత క్రిందికి లాగాడు. ఆక్సిలేషన్ రాడ్‌ను మరింత పైకి త్రోసి, కాబిన్ విండో డోరు పూర్తిగా తెరిచాడు. తర్వాత రివర్స్ లాక్ తీసేశాడు.

బ్రేక్ రాడ్‌ను చేత్తో అలానే నొక్కిపట్టి వుంచి శరీరాన్ని పూర్తిగా తెరుచుకొన్న విండోలోనుండి బయటకు పెట్టాడు. కాళ్ళు ఇంజన్ ముందుకు చుట్టూవున్న ఇనుప రెయిలింగ్ మీద ఆనగానే బ్రేక్‌ను వదలిపెట్టి ప్రక్కకు దూకేశాడు.

బ్రేక్ వదలగానే డీసిల్ కారు ఒక్క వుదుటున ముందుకు కదిలింది. విక్రం డీసిల్ కారు తనను దాటి వెళ్లే వరకూ అలాగే వుండి లేచి నిలబడ్డాడు. డీసిల్ కారు

వేగంతో, వెనక్కి, విజయవాడవైపుకు దూసుకుపోతోంది డ్రైవరు లేకుండానే.

18

కంట్రోలర్ రూమ్ రైల్వే అధికారుల హడావిడితో నిండిపోయి వుంది. కృష్ణా సిమెంట్ హాల్ట్ నుండి అప్పుడే డీసిల్ కారు స్టేషన్ దాటినట్లు మెసేజ్ వచ్చింది.

"ఎలర్ట్ మంగళగిరి స్టేషన్..." అరిచాడు రాజం అసహనంగా.

మరో మూడు నిముషాలకి కంట్రోలర్ ఆశ్చర్యంగా కృష్ణా సిమెంట్ హాల్ట్ ఎ. యస్. యమ్. రిపోర్ట్ వింటున్నాడు.

"డీసిల్ కారు మళ్ళీ వెనక్కి వస్తుందట. ఎ.యస్.ఎమ్. చెప్పాడు" అన్నాడు కంట్రోలర్.

"బాస్టర్డ్! మద్రాసువైపుకు వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ వెనక్కి తిరిగి వస్తున్నాడన్నమాట" అన్నాడు రాజం ఈ వైపు స్టేషన్స్‌ను ఎలర్ట్ చెయ్యమని చెపుతూ.

ఇంతలో కంట్రోలర్ మళ్ళీ చెప్పాడు "కృష్ణా కెనాల్ యస్. ఎమ్. డీసిల్ అతి వేగంగా విజయవాడవైపు వస్తుందని చెపుతున్నాడు."

అయిదు నిముషాల్లో డీసిల్ కారు విజయవాడ దాటి హైదరాబాద్ రైలుమార్గంమీద దూసుకుపోతోంది. స్టేషన్ లైట్ల కాంతిలో కాబిన్‌లో డ్రైవరు లేని విషయం గమనించబడింది.

విషయం తెలియగానే రైల్వే అధికారులు క్షణంపాటు స్థాణువులైపోయారు.

"మైగాడ్! అందులో ప్రయాణికులందరూ స్పృహతప్పి వున్నారు. డ్రైవరు లేకపోతే ఏ వంపుదగ్గరో పట్టాలు

తప్పి ఏక్సిడెంట్ అయే ప్రమాదముంది. డు సమ్‌థింగ్" డి. యస్. రాజం పిచ్చెక్కినట్లు అరుస్తున్నాడు.

"హలో...హలో...పోలీస్ కంట్రోల్...వెంటనే విజయవాడ_మంగళగిరి మధ్య రోడ్లన్నీ కాపు కాయండి. ప్రతి వాహనం, ప్రతి మనిషినీ చెక్ చేయమనండి. దుండగులు ట్రైన్ దిగిపోయి ఇంకా పది నిముషాలు కూడా కాలేదు. హెలికాప్టర్లను వెంటనే వెతకడం ప్రారంభించమనండి" డి. ఐ. జి. పోలీస్ కంట్రోల్ వైర్‌లెస్‌లో అరుస్తున్నాడు.

19

విక్రం గబగబా ట్రాక్ అవతలివైపునవున్న కొండ అంచుకు పరిగెత్తాడు.

అప్పటికే రాజా, గనీ, జానీలు చకచకా డ్రస్ ఛేంజ్ చేసుకొంటున్నారు అక్కడ. రెండు నిముషాల్లో గడ్డం, మీసాలు తీసేశారు.

"ఓ. కె. లెటజ్ రన్!" అన్నాడు విక్రం రెండు నిముషాల తర్వాత. అందరూ నాలుగు సూట్ కేస్‌లతో కొండ అవలి దిగువకు వచ్చారు.

కలకత్తా_మద్రాస్ ట్రంక్ రోడ్డు ప్రక్కగా వున్నది ఆ ప్రదేశం. అక్కడ నల్ల అంబాసిడర్ కారొకటి ఆగి వుంది. సూట్ కేసులు డిక్కీలో పెట్టి నలుగురూ చకచకా లోపలకు ఎక్కి కూర్చొన్నారు.

విక్రం కారు స్టార్ట్ చేసి విజయవాడవైపు తిప్పాడు. ఆక్సిలేటర్ మీద కాలు బలంగా నొక్కాడు. వింటి నుండి వదిలిన బాణంలా పరిగెత్తింది కారు.

కృష్ణా బారాజ్ దాటి విజయవాడ ప్రవేశిస్తుండగా, సైరన్‌లు మ్రోగించుకొంటూ పోలీస్ కార్లు బారేజ్

దారికి అడ్డంగా ఆగడం గమనించారు నలుగురూ. రోడ్ బ్లాక్ చేయబడింది.

ఆగంతకులు నలుగురూ విస్తుపోయారు. తమ కదలికను అంత క్విక్‌గా ఎలా పసిగట్టారో అర్థం కాలేదు వాళ్ళకు.

20

రైలు చక్రాల స్ప్రింగులకు, డోర్ మెట్లకూ మధ్య వున్న గోపాల్ పరిస్థితి త్రిశంకు స్వర్గంలో వున్నట్లు వుంది. రైలు అతి వేగంగా హైదరాబాద్ ట్రాక్ మీద వెళ్ళిపోతోంది.

ముందు ముగ్గురు దుండగులు దిగినప్పుడు క్రిందికి దిగుదా మనుకొంటుండగానే రైలు కదిలింది. ఆ తర్వాత విక్రం క్రిందకు దూకేయడం చూసి జరిగిందేమిటో ఊహించగలి గాడు గోపాల్.

ఇంజన్ ఆన్ చేసి క్రిందకు దిగిపోయారు దుండగులు. బయటినుండి చూస్తోన్న వాళ్ళకి ఇంకా వాళ్లు ట్రైన్ లోనే వున్నట్లు అనిపిస్తుంది. ఈలోగా వాళ్ళు తప్పిం చుకుపోయారు. ఎక్కడ దిగిందీ, ఎలా వెళ్ళిందీ ఎవరికీ తెలియదు.

"క్లవర్ ఫెలోస్!" అనుకొన్నాడు గోపాల్. ట్రైన్‌లో ప్రయాణీకు లందరూ స్పృహతప్పి వున్న విషయం అతనికి తెలుసు. గంటకు దాదాపు వంద కి. మీ. వేగంతో డ్రైవరు లేకుండా వెళుతున్న బండి ఎక్కడో ఓ చోట ప్రమాదానికి గురవడం ఖాయం.

హైదరాబాద్ వరకూ లైన్ క్లియర్ వుండడంచేత డీసిల్ కారు ఎక్కడా ఆగకుండా పరిగెడుతోంది. ఎక్క డయినా కాస్త ఎక్కువ వంపుగా వుంటే చాలు రై

మార్గంలో బండి యాక్సిడెంట్ కి గురవడానికి— అంత వేగంలో బండి అటు ఇటు వూగిపోతోంది.

వెంటనే వైర్ లెస్ సెట్ తీసి డి. ఐ. జికి పరిస్థితి వివరించాడు గోపాల్.

* * *

ఆపరేషన్ మిలియన్ తాలూకు నలుగురు దుండగులు కొద్ది ఘర్షణ అనంతరం పోలీసులకు లొంగిపోయారు.

గోపాల్ అతి కష్టంమీద కాబిన్ లోకి ప్రవేశించి డీసిల్ కారును ఆపేశాడు.

మెంటల్ షాక్ తగిలిన పరిమళ ఆర్నెల్లపాటు ఆస్పత్రిలో వుండిపోవలసి వచ్చింది.

అహమ్మద్ ఆ తర్వాత ఎప్పుడూ సెకండ్ క్లాసులోనే ప్రయాణం చేశాడు.

జ్యోతి సేతుమాధవన్ ని పెళ్ళి చేసుకొన్నది ఇష్టపూర్వకంగా.

సబ్ ఇన్ స్పెక్టర్ గోపాల్ కు రాష్ట్రపతి పతకం లభించింది.

—: ఐపోయింది :—